# కర్నూలు I నంద్యాల వార్త

7 ఏప్రిల్, 2023 | శుక్రవారం | పేజీలు 4


## సరిహద్దు రాళ్ల గుర్తింపు నిర్ధేశిత గడువులోగ పూర్తిచేయాలి

**నంద్యాల విద్య, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:** జగనన్న భూహక్కు, భూ రక్ష పథకం కింద చేపట్టిన రీసర్వే కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన సరిహదు ్రరాళ్ళ గుర్తింపును నిర్ధేశిత గడువులోగ పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కెఎస్ జవహార్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌ను అదేశించారు. గృహనిర్మాణంలో భాగంగా లేఅవుట్ వారిగా ఇళ్ళపట్టాల గృహ నిర్మాణ ప్రగతిని పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలకు సంబంధించి గురువారం అయా శాఖలకు సంబంధించి కలెక్టరు కార్యాలయంలో వివిధ అంశాలపై సిఎస్ సమీక్షించారు. వేసవికాలంలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అందుకు అనుగు ణంగా ప్రణాళికలు రూపొందిం చుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను అదేశించారు. మండలాల్లో, గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసేవిధంగా చర్యలు చేపట్టాలని అదేశించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం కింద జిల్లాలోని చెంచుగూడెంలలో పనిచేస్తున్న ఉపాధి హామి కూలీలకు 30 శాతం అదనపు అలవెన్స్ మంజూరు చేయాలని కలెక్టర్ కోరారు. అనంతరం కలెక్టరు డా.మనజీర్ జిలాని సామూన్ మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామిపథకం కింద 32 చెంచుగూడెంలలో పనిచేస్తున్న కూలీలకు గతంలోనే ఐటిడిఏ సంస్థ అడ్వాన్స్ రూపంలో వేతనాలు చెల్లించడంతో పాటు 30 శాతం అదనపు



అలవెన్స్‌లు కూడ ఇచ్చేదని అదేరీతిలో వేతనాలు చెల్లించాలని కూలీలు కోరుతున్న నేపథ్యంతో చర్యలు తీసుకోవాలని అదేశించారు. ఈకార్యక్రమంలో కలెక్టరుతో పాటు డిఆర్వో పుల్లయ్య వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటి వద్దకే ఉచిత వైద్యం..



**- విప్లవాత్మక మార్పులతో వైద్యరంగానికి పెద్దపీట**

**- రాష్ట్ర ఉపాధి,కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం**

**రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామంలో ఇంటి వద్దకే ఉచిత వైద్యం అందించేలా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి వైద్యరంగానికి పెద్దపీఠ వేశారని రాష్ట్ర ఉపాధి,కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని పి కోటకొండ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని మంత్రి జయరాం,జిల్లా కలెక్టర్ కోటేశ్వర రావుతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్బంగా గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి జయరాం మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో వైద్యం కోసం డాక్టర్ల చుట్టూ తిరిగేవారని అలాంటి అవసరం లేకుండ గ్రామంలోని ప్రతి ఇంటి వద్దకే ఉచిత వైద్యం దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రవేశపెట్టిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.**



**దేవనకొండ, ఏప్రిల్6, ప్రభాతవార్త :** ఫ్యాక్షన్‌తో ఒకప్పుడు రగిలిపోయిన పి కోటకొండ గ్రామంలో పోలీసులు తప్ప వైద్య అధికారులు వచ్చిన దాఖలాలు లేవని ప్రజలకు 14రకాల వైద్య పరీక్షలు, 67రకాల మందులు సమకూర్చే లాగా వాహనంలో ఉండేలా చర్యలు తీసుకున్నారన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,అభివృద్ది ఇతర రాష్ట్రాల పాలకులు, ప్రజలు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నట్లు పేర్కొన్నారు. పి కోటకొండ గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు 30పడకల ఆసుపత్రికి, హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ద్వారా రైతులకు సాగునీరు అందించేలా ప్రతిపాదనలు పంపాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ నెలలో రెండు రోజులు ప్రతి సచివాలయం పరిధిలోని అనారోగ్య భాదితులకు పరీక్షలు మందుల పంపిణీ, మద్యాహ్నం నుండి అంగన్‌వాడి పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన 104 నూతన వాహనాన్ని రిబ్బన్‌కట్ చేసి వారు ప్రారంభించి అంబులెన్స్ వాహనంలోని వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రామగిడ్డయ్య, డిప్యూటీ డివిజన్ వైద్యాధికారి రఘురామరెడ్డి, ఆర్డీఓ మోహన్‌దాస్, ఎంపిడిఓ గౌరీదేవి, తహశీల్దార్ సుదర్శనం, మంత్రి సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు, జడ్పిటిసి కిట్టు,సర్పంచ్ బి తిమ్మక్క,ఎంపిటిసి వెంకటలక్ష్మి,ఎంపిపి భర్త లుముంబా,వైసిపి మండల కన్వినర్ కప్పట్రాళ్ల మల్లికార్జున,తెర్నేకల్ సర్పంచ్ అరుణ్‌కుమార్, వైసిపి నాయకులు ప్రేమనాథ్‌రెడ్డి,కప్పట్రాళ్ల దివాకర్‌నాయుడు,హనుమంతరెడ్డి,కృష్ణ, లక్ష్మణస్వామి,ఎల్కె శ్రీను, రంగస్వామి,రాజన్న, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక పరిమళం.. తుంగతీరం..!

**- అశేష భక్తజన సందోహం మధ్య శ్రీరామలింగేశ్వర రథోత్సవం..**





**కందుకూరు(కోసిగి), ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** పవిత్ర తుంగభద్ర నదీతీరం ఆధ్యాత్మికంగా మారింది..గురువారం సాయంత్రం అశేష జనసందోహం మధ్య శ్రీరామలింగేశ్వర స్వామి రథోత్సవం కన్నుల వండుగ జరిగింది..కనుమలో సూర్య భగవానుడు తలవాల్చుతుండగా భక్తులు జయ జయ ధ్వనులు పలుకుతుండగా నూతనంగా చేసిన రథం అత్యంత రమణీయంగా ముందుకు సాగింది.. పండితులు వేద మంత్రాలు పఠిస్తుండగా రథంపైకి అరటిపండ్లను విసురుతూ భక్తులు తమ మొక్కులను చెల్లించుకున్నారు.. ముందుగా ఉదయం నుండే పూర్ణహోమం చేసి భక్తులకు తీర్థప్రసాదాలు ఇచ్చి ఆశీస్సులను అందించారు ప్రముఖ పీఠాదిపతులు.. ఈ సందర్భంగా వీర తపస్వీ వీరభద్ర శివాచార్యులు, అభినవ మహాంత మహాస్వాములు, మహాస్వాములు ప్రత్యేక హోమాలు నిర్వహించారు.. త్రేతా యుగంలో శ్రీరాముడు ప్రతిష్టించిన శివలింగంకు భక్తిశ్రద్దలతో పూజలు నిర్వహించి ప్రత్యేక పల్లకిపై దేవాలయం నుండి తీసుకువచ్చి రథంపై కూర్చో బెట్టారు.. అనంతరం పండితులు వేదమంత్రాలు చదువుతుండగా రథంను అశేష భక్త జనులు తాడుతో ముందుకు లాగి తమ భక్తిను చాటుకున్నారు.. సుమారు రెండు వందల మీటర్ల వరకు రథంను లాగి అక్కడే పొలాల్లో వెలసిన శ్రీబసవేశ్వర విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసిన తరువాత రథంను తిరిగి యదాస్థానంలో చేర్చడంతో ఈ రథోత్సవం ముగిసింది.. ఈ సమయంలో వచ్చిన మహాస్వాములందరిని ప్రత్యేక పూలమాలతో శాలవాలతో ఆలయ కమిటీ ఉపాధ్యాక్షులు గౌతం బాబు, కార్యదర్శి బెట్టన్నగౌడ్‌లు వారిని ఘనంగా సన్మానించారు.. ఈ సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ రాజారెడ్డి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసారు..ఈకార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా మంత్రాలయం ఎంఎల్ఎ బాలనాగిరెడ్డి తరుపున మండల ఇంచార్జ్ మురళీమోహన్‌రెడ్డి హాజరయ్యారు..



## శ్రమకు సిలువ సూచన..
## పాపి క్షమకు క్రీస్తు రచన..!

- అనంతమైన ప్రేమకు సంకేతం..గుడ్‌ఫ్రైడే
- సిలువలో ప్రేమ ప్రవాహం..
- మనిషి కొరకు దైవమే..ఇలో కరిగి వెలిగె..!
- సిలువలోని 'సప్త' స్వరాలు..విలువకట్టలేని జీవన వరాలు..
- నేడు గుడ్‌ఫ్రైడే

**కోసిగి, ప్రభాతవార్త :**



**"సర్వపాప పరిహారో రక్త ప్రోక్షత్మేమవశ్యకమ్.. తద్ రక్తమ్ పరమాత్మేన పుణ్యదాన బలియాగమ్"" (రక్తం చిందింపకుండ ఎవరికి పాప క్షమాపణ కలుగదు..మానవుల పాపపు విమోచన కోసం ఒక పుణ్యాత్ముడు బలిదానం కావాలి..) "ఉపనిషత్తులు, పురాణాల్లో ఉన్న వేదాంత సిద్ధాంతం ఇది.. క్రైస్తవ విశ్వాస సమాజానికి సిలువ శ్రమల్లో నుండి అంకురించింది.. సిలువ మానవ సంబందాల సంధి..పాపులను చేర్చేందుకు పరలోకపు**

మానవులు చేసిన పాపములను పరిహారించేందుకు ఆ దేవుడు తన రక్తాన్ని చిందించి మరణించిన రోజునే ప్రపంచంలో అధిక సంఖ్యాకులైన క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేగా పవిత్రంగా ఆచరిస్తారు. "క్రీస్తు సిలువ మరణం.. మానవాళి రక్షణకు సోపానం" అని నమ్మె ఈ రోజు శుభ శుక్రవారం. మానవుడు చేసిన పాపాలను తొలగించడానికి ఒక పుణ్యాత్ముడు మృతి చెందాలని వేదాలు ఘోషిస్తున్న ప్రకారం ఆయన మరణ విధానాన్ని ఈ రోజు తలపోసుకున్నప్పుడు అనేక క్రైస్తవ హృదయాలు ద్రవిస్తాయి. ఆయన సిలువపై పలికిన సప్త సూక్తులను జ్ఞాపకానికి తెచ్చుకున్నప్పుడు మధురమైన భావాలు విరభూస్తాయి. అసలు శుభ శుక్రవారానికి ముందు 40రోజులు పాటు క్రైస్తవులు లెంట్ (శ్రమలు) కాలంను పాటిస్తారు. అంటే ఈ రోజుల్లో నిష్టతో ఉండి ఉదయం నుండి మధ్యాహ్నం 3గంటల వరకు ఉపవాసంతో సిలువ శ్రమలను గురించి ప్రార్ధనలు జరుపుకుంటారు. నిజంగా ఈ కాలం క్రైస్తవులకు తపస్సు కాలం. ఈ 40 రోజుల పరిశుద్ధ కాలంలో క్రీస్తు సిలువ శ్రమలను తమ మనస్సులలో ధ్యానించుకుంటూ ప్రతి విధమైన పాపాన్ని త్యజిస్తారు. కొందరు విలువైన వస్త్రాలు కూడా ధరించరు. కొంత మంది స్త్రీలు ఈ 40రోజులలో పూలు కూడా పెట్టుకోరు. ఈ 40 రోజుల అనంతరం వచ్చే చివరి శుక్రవారమే గుడ్‌ఫ్రైడే. ఈ రోజున ప్రపంచంలోని ప్రతి క్రైస్తవుడు క్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలను ధ్యానించుకుంటారు.వీటిని ఓసారి బైబిల్ పరంగా పరిశీలిస్తే... మిట్ట మధ్యాహ్నం ఎర్రటి ఎండలో యేసుక్రీస్తు సిలువపై వ్రేలాడుతున్నప్పుడు, తగిలిన గాయాలు రక్తమై ప్రవహిస్తున్నాయి.తల మీద పెట్టబడిన ముళ్లకిరీటం గుచ్చకోవడంతో తలచుట్టూ, తలపైన గాయాలు కలిగి రక్తం ప్రవహిస్తోంది.ప్రక్కలో ఈటె గుచ్చి, మృధువైన ముఖాన ఉమ్మి వేశారు. తాగేందుకు చేదు చిరకనిచ్చారు.

● వివరాలు 2లో

## ప్రపంచానికే బిజెపి పరిపాలన మార్గదర్శకం

**కర్నూలు విద్య, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:** దేశంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం చేస్తున్న పరిపాలన ప్రపంచానికే మార్గదర్శకంగా నిలుస్తోందని రాజ్యసభ మాజీ సభ్యుడు టిజి వెంకటేష్ పేర్కొన్నారు. బిజెపి అవిర్భావ దినోత్సవాన్ని పురష్కరించుకొని నగరంలోని బిజెపి పార్టీ కార్యాలయం వద్ద టిజి వెంకటేష్ పార్టీ జెండాను అవిష్కరించారు. బిజెపి జిల్లా అధ్యక్షులు అధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో టిజి వెంకటేష్ మాట్లాడుతూ 1952లో శ్యామ్‌ప్రకాష్ ముఖర్జీ స్థాపించి జనసంఘ్, ఆ తరువాత భారతీయ జనతా పార్టీగా మార్పు చెందిందని వివరించారు. భారతీయ జనతాపార్టీ వెనుక ఎన్నో త్యాగాల చరిత్ర ఉందని శ్యామ్ ప్రకాష్ ముఖర్జీ చనిపోవడానికి కారణాలు ఇంతవరకు తెలియలేదన్నారు. ఎందరో మహానీయుల త్యాగాలతో బిజెపి అంచలంచలుగా ఎదిగి ప్రస్తుతం దేశాన్ని పాలిస్తుందన్నారు. 140 కోట్ల జనాభా వున్న భారతదేశంలో బిజెపి ప్రభుత్వం ప్రధామంత్రి నరేంద్రమోధీ సారధ్యంలో చక్కటి పరిపాలన అందిస్తుందని పేర్కొన్నారు. బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## సంక్షేమపథకాలు అందించడమే వైకాపా లక్ష్యం

**-రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి**



**డోన్,ఏప్రిల్6,ప్రభాతవార్త :** అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే వైకాపా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. డోన్ పట్టణంలోని 10వ సచివాలయం 16వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మంత్రి బుగ్గన,మునిసిపల్ ఛైర్మెన్ సప్తశైల రాజేష్,వైఎస్ ఛైర్మెన్ జాకీర్‌హుస్సేన్, కౌన్సిలర్‌లతో కలిసి గడపగడపకు తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు.రాబోవు రోజుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలో మరిన్ని పథకాలు ప్రజలకు చేరువ చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు కౌన్సిలర్‌లు దినేష్‌గౌడ్,ఆర్టీ రమణ,సుంకయ్య,వైకాపా నాయకులు మహేంద్ర నాయుడు, డంకేష్,భాస్కర్,గోపాల్,దస్తగిరి,అశోక్,మునిసిపల్ కమీషనర్, సిబ్బంది,మెపామ సిబ్బంది,సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## అకాల వడగండ్ల వర్షం.. అపార నష్టం..!

**- దెబ్బతిన్న పంటలు**



**కౌతాళం, ఏప్రిల్06, ప్రభాతవార్త ;** మండలంలోని ఆయా గ్రామాల్లో వర్షం బీభత్సం సృష్టించింది. మండలంలోని నదిచాగి గ్రామంలో భారీ వడగండ్ల వాన కురిసింది. వర్షం వల్ల ప్రధాన పంట అయిన వరి పంట దెబ్బతింది. కేవలం 15 రోజుల్లో చేతికిరావాల్సిన పంట వడగండ్ల వర్షానికి దాదాపుగా దెబ్బతిన్నాయని రైతులు వాపోయారు. సాయంత్రం గంటపాటు కురిసిన గాలితో కూడిన భారీ వర్షానికి హాల్వి నుంచి మ్యాళిగనూరు గ్రామం వరకు దాదాపు 6-8 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. 10-15 విద్యుత్ స్తంభాయిలు వాలిపోయి విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. విద్యుత్ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని, తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేసేలా చర్యలు తీసుకున్నట్లు లైన్‌మెన్ కిరణ్ తెలిపారు.

## అంగన్‌వాడి టీచర్ల షికారుపై పిడి ఆదేశాలు..!

**- ఆగమేఘాలపై సూపర్‌వైజర్ల తనిఖీలు..**

ఆదోని,ఏప్రిల్ 6,ప్రభాతవార్త : విధులకు దుమ్మా కొట్టి ఢిల్లీ,మనాలి,అగ్ర ప్రాంతంలో షికార్లు కొడుతున్న కొందరు అండన్‌వాడి వర్కర్లు,టీచర్లపై జోరుగా.. హుషారుగా.. షికారు.. పోదమా..అంటూ బుధవారం ప్రభాతవార్తలో వచ్చిన కథనం పాఠకులకు విధితమే. ఈ మేరకు జిల్లా అధికారిని స్పందించి గురువారం రోజు సంబంధిత సూపర్‌వైజర్లకు ఆదేశాలు జారీ చేసి ఏం జరిగింది,అంగన్‌వాడిలో వర్కర్లు ఉన్నారా.. లేరా..? బెనిఫిషియర్లకు మన సంక్షేమ శాఖ నుండి పౌష్టికాహారాలు అందుతున్నాయా.. లేవా..?రికార్డులు పరిశీలించి వెంటనే నాకు నివేదికలు ఇవ్వాలని హుకుం జారీ చేశారు. ఈ కోణంలో గురువారం సూపర్‌వైజర్లు సంబంధిత సెంటర్లను తనిఖీలు చేయగా వార్తలో వచ్చిన కథనం వాస్తవమేనని తేలింది. తనిఖీలు చేసిన సెంటర్‌లో అధికారికంగా ఉన్న బెనిఫిషియర్ల సంఖ్య కనబడకపోయేసరికి ఏం జరుగుతుంది సెంటర్లలో అని సూపర్‌వైజర్లు మండిపడేసరికి స్థాయి ఆయాలలో కొందరు ఈ రోజు హనుమాన్ జయంతి ఉంది అందుకే ఎవ్వరు రాలేదని..కాకమ్మ కథలతో..కల్లిబొల్లి కథలు..అల్లారని తెలిసింది. సూపర్‌వైజర్లు ఈ విషయంపై పైస్థాయి అధికారులకు ఎటువంటి నివేదికను అందచేస్తారో..లేదా..అంతా మావాళ్లే కదా అని సర్ధిచెప్పుకుంటారో..?ఈ వారం రోజుల బెనిఫిషియర్లకు సంబంధించిన బిల్లులను కూడా ఆమోద పరుస్తారా..? లేదా..అన్నది అంతుచిక్కని ప్రశ్నగా మిగిలింది. ఈ షికారుకు సంబంధించిన సెంటర్లపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారా..?లేదా..?అన్నది పాఠకులు వేచిచూడవలసిందే మరి..!

ఈ షికారుపై జిల్లా అధికారిణి పిడి ఉమామహేశ్వరిని చరవాణి ద్వారా వివరణ కోరగా సూపర్‌వైజర్ల ద్వారా సమాచారం అడిగి తెలుసుకుంటాను. రిజిస్టర్‌లో చూస్తాము. షికారుకు వెల్లారని నిరూపణ అయితే వారి జీతం కట్ చేసి ఏప సెంటర్లలో ఈ సమస్య ఉందో సమగ్ర సమాచారం తెలుసుకుని మెమోలు జారీ చేసి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుని బెనిఫిషియర్లకు మా శాఖ నుండి ఇబ్బందులు లేకుండ చూసుకుంటామని తెలిపారు.



## అధిక ధరలతో రైతుల నడ్డి విరుస్తున్న ఎరువుల దుకాణదారులు

**- దాడులు నిర్వహిస్తున్న తీరుమారని వైనం**

**- బిల్లులు లేకుండా ఎరువుల అమ్మకాలు**

**అవుకు, ఏప్రిల్6, ప్రభాతవార్త:** దేశానికి వెన్నుముక రైతని చెబుతుంటారు.కాని రైతులు వ్యవసాయం చేయాలంటే ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.ఒక వైపు రైతులకు గిట్టుబాటు ధరలేక ఇబ్బందులు పడుతుంటే మరోవైపు అధిక ధరలతో ఎరువులను అమ్ముతూ రైతుల సాగు వ్యయాన్ని విపరీతంగా పెంచుతున్నారు.రైతులు వ్యవసాయం చేయాలంటే భయపడుతున్నారు.రైతులు వ్యవసాయం చేసి అప్పులబారిన పడుతున్నారు.ఆ అప్పులు తీర్చలేక చాలా మంది రైతులకు ఆత్మహత్యలే శరణ్యమవుతుంది.ఇలా రైతుల ఆత్మహత్యలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. రైతుల కోసం ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేసి ఎరువులను సరఫరా చేస్తున్నా రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ప్రైవేట్ ఎరువుల దుకాణాలను ఆశ్రయిస్తున్నారు.ఇదే అదునుగా ప్రైవేట్ ఎరువుల దుకాణ యజమానులు ఎరువుల ధరలను అమాంతం పెంచేస్తున్నారు.వ్యవసాయ రంగం గత కొన్ని సంవత్సరాలుగా తీవ్ర సంక్షోభాన్ని



ఎదుర్కొంటుంది.పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోవడంతో పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.ఈ నేపథ్యంలో ఎరువులు,విత్తనాలు,పురుగు మందుల ధరలు కూడా భారీగా పెరిగాయి.రసాయన ఎరువుల ధరలు కూడా భారీగానే పెరిగాయి.అవుకు మండలంలో రబీ సీజన్‌లో 5234ఎకరాలలో వివిధ పంటలను రైతులు సాగుచేస్తున్నారు. ఇందులో అధికంగా వరి 2212ఎకరాల్లో,శనగ 5,570ఎకరాలలో,మిరప 226 ఎకరాల్లో,జొన్న 2488 ఎకరాల్లో,మినుము 648 ఎకరాలలో,పొగాకు 247 ఎకరాలలో,వేరుశనగ 147 ఎకరాలలో,కుసుమ 224 ఎకరాలలో అలాగే 4696 ఎకరాలలో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేస్తున్నారు.ఇందుకోసం అవుకు మండలంలో మొత్తం 20 ఎరువుల,పురుగు మందుల దుకాణాలు ఉన్నాయి.ఇందులో కొందరు ఎరువుల దుకాణాదారులు యూరియా,డీఏపీలను అధిక ధరలకు అమ్ముతున్నారు.అదే విధంగా రైతులకు ఎలాంటి బిల్లులు లేకుండా ఎరువులను అమ్ముతున్నారని రైతులు పేర్కొంటున్నారు.ఇలాంటి సంఘటనలను అధికారులు ఎలా అరికడతారోనని రైతులు ఎదురుచూస్తున్నారు. అంతేకాకుండా నకిలీ విత్తనాలకు,నకిలీ మందులకు పలు దుకాణాలు అండగా మారాయి.ఈ దుకాణాల పై చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులను వేడుకుంటున్నారు. పట్టణంలోని ప్రముఖ ఎరువుల దుకాణాలలో ఎన్నిసార్లు అధికారులు తనిఖీ చేస్తున్నా ఎరువుల దుకాణదారుల తీరులో ఎలాంటి మార్పు కనిపించడంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**వ్యవసాయాధికారి ప్రసాదరావు వివరణ :** ఈ విషయం పై అవుకు మండల వ్యవసాయాధికారి ఈ. ప్రసాదరావును వివరణ కోరగా పట్టణంలోని ఎరువుల దుకాణాలను అలాగే శివవరం గ్రామంలోని ఎరువుల దుకాణాలను తరుచుగా సందర్శించి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం జరిగిందని ఆయన తెలియజేశారు.గత కొన్ని నెలల క్రితం అవుకు పట్టణంలోని ప్రముఖ ఎరువుల దుకాణాల పై దాడులు నిర్వహించి అధిక ధరలకు అమ్మిన ఎరువులను సీజ్‌చేసి 6ఏ కేసు నమోదు చేశామని ఆయన తెలియజేశారు. అదే విధంగా అధిక ధరలకు ఎరువులను అమ్మిన వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలియజేశారు.



# శ్రమకు సిలువ సూచన.. పాపి క్షమకు క్రీస్తు రచన..

**తరువాయి..** ఇంతగా యేసును అధికారులు, యూదులైన ప్రజలు హింసిస్తున్నా క్రీస్తు మాత్రం వాటన్నింటిని ఓర్చుకుంటూ నోరు తెరచి మొదటి మాటగా "తండ్రీ..! వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించు"మని" వేడుకొన్నాడు.. ఈ మొదటి మాటతో ఆయన దేహంలో నుండి స్రవించే రక్తధారలతో పాటు ప్రేమధారలు కూడా ఒలికిపోయి నవిగా స్పష్టమవుతోంది. యేసుక్రీస్తు సిలువ వేయబడినప్పుడు ఆయనతోపాటు మరో ఇద్దరు దొంగలు కూడా సిలువ వేయబడ్డారు. క్రీస్తుకు కుడి ప్రక్కన వ్రేలాడుచున్న దొంగ మనస్సాక్షి, పశ్చాత్తాపం కలిగినవాడు. ఇక రెండవ దొంగ క్రీస్తుకు ఎడమవైపున వ్రేలాడుచూ నీవు దేవుడైన క్రీస్తువు కదా! నిన్ను నీవు రక్షించుకుని, మమ్ములను కూడా రక్షించమని హేళన చేశాడు. అయితే కుడి వైపున ఉన్న దొంగ మొదటి దొంగను గద్దిస్తూ "యేసూ! నీవు నీ రాజ్యంలోనికి వచ్చినపుడు నన్ను జ్ఞాపకం చేసుకో"మని" కోరుతాడు. అందుకు ప్రభువు రెండవ మాటగా "నేడు నీవు నాతో కూడా వరదైసులో ఉందువ"ని నిశ్చయముగా చెప్పుచున్నాను" అని పలుకుతాడు.. అక్కడ ఉన్న తండోప తండాల ప్రజలలో క్రీస్తు తల్లి మరియ కూడా ఉన్నారు. యేసుప్రభువు పడుతున్న శ్రమలను గురించి ఆర్తనాథంతో రోదిస్తూ దూరంగా ఉన్న ఆమెను యేసు తల ఎత్తి చూచి మూడవ మాటగా "అమ్మా! ఇదిగో నీ కుమారుడు"" అని తన శిష్యుడైన యోహాను వంక చూపెను. అదే విధంగా యోహాను వైపు చూసి "ఇదిగో నీ తల్లి"" అని తన తల్లివంక చూపెను. ఈ మాట పలుకుట ద్వారా తల్లి ప్రేమ పట్ల తనకున్న బాధ్యతను బాంధవ్యంను తెలియజేసాడు.. సిలువపై ప్రభువు పడుతున్న శ్రమలను చూచి సహించలేక సృష్టి యావత్తు గడగడ వణికెను. సూర్యుడు చీకటిగా మారడంతో ఆ దేశంలో అంధకారం అలుముకుంది. ఈ సమయంలో నాలుగవ మాటగా "ఏలీ..ఏలీ..లామా సబక్తాని"".. అనగా "నాదేవా...! నాదేవా..! నన్నెందుకు చేయి విడిచితివని పలికి నివేదించుకున్నాడు.. అది మిట్ట మధ్యాహ్నం..తీవ్ర ఎండకాలం.. చెట్లు, చేమలు లేని గొల్గొత (కల్వరి) కొండప్రదేశం. పక్కలో బల్లెం పోటు, తలపై ముళ్ళ కిరీటం, రక్తం నీరులా ద్రవిస్తున్న తరుణంలో ఎవరికైనా దప్పిక వేయకమానదు. అందుకే అయిదో మాటగా "నేను దప్పికగొన్నాను" అని పలికెను. ఈమాటతో తాను కూడా మానవుడిగా దప్పిక గొనుచున్నానని తెలియజేస్తున్నాడు. ఇక మానవకోటికి తాను చేయవలసిన బాహ్య, ఆత్మీయ సేవను సమాప్తం చేయడంతో పాటు లేఖనములు నేరవేరునట్లు క్రీస్తు చేదు చిరక పుచ్చుకొని "సమాప్తమైనది"" అంటూ ఆరవ మాటగా పలికాడు. ఇక క్రీస్తు చివరిగా పలికిన ఏడవ మాట"తండ్రీ! నీచేతికి నాఆత్మను అప్పగించుకొనుచున్నాను"".. అంటూ తనంతట తనే ఆత్మను దేవునికి అర్పించుకొనెను.. క్రీస్తు తన సిలువ మరణంను తండ్రీ! అనే ప్రార్థనతో ప్రారంభించి, తిరిగి చివరిగా తండ్రీ! అనే ప్రార్థనతో తన్ను తాను అప్పగించుకొనుట ద్వారా తన కల్వరి పయణాన్ని ముగించాడు. ఇదే శుభ శుక్రవారం.. గుడ్‌ఫ్రైడే. ఈ దినం ప్రతి చర్చిలలో క్రైస్తవులు ఏలాంటి ఆర్భాటం..హంగామా లేకుండా ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ప్రత్యేక ప్రార్థనలు జరుపుకుంటారు. లెంట్ కాలంలో 40రోజులు ఉపవాసం ఉండని క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే రోజు మాత్రం ఇంటిల్లి పాటు ఉపవాసం ఉంటూ ఇంట్లో పొయ్యి వెలిగించరు. ఈ దినమంతా శోకంతో ఉంటారు.. పాపాలు క్షమించమని వేడుకుంటారు. అందుకే శ్రమకు సిలువ సూచన.. పాపి క్షమకు క్రీస్తు రచన..

## ఇరుకురోడ్డులో అగిన లారీ రాక పోకలు బంద్

**కోవెలకుంట్ల,ఏప్రిల్ 6,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన సంజామలో గోండ్రాగు వాగులో లారీ అగి పోవడము రాక పోకలకు తీవ్ర అంతరాయము ఏర్పడింది.కోవెలకుంట్ల నుండి తిమ్మానాయునిపేటకు వెళ్ల రస్తాలో సంజామల వద్ద గోండ్రాగు వాగు చాలా ఇరుకుగా ఉండటముతో రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు ఈ వాగులో వాహనాలు ఇరుకుక్క పోవడముతో పాటు అలాగటే వర్షా కాలంలో చిన్న పాటి వర్షానికే వాగు ఉప్పొంగడముతో అటు వైపు వెళ్ల వాహనాలు 1 రోజులపాటు అగి పోతుంటాయి.అలాగే ఏదైన వాహనము పొరపాటులో వాగులో నిలిచి పోతే కూడా రెండు మూడు రోజులు రాక పోకలు బంద్ అవుతున్నాయి.అందులో బాగంగా గురువారము వాగులో ఒక పొట్టు లారీ కట్టలు ఊడి పోవడము వాగులో నిలిచ పోయింది.దీనితో వాహనాల రాక పోకలకు అంతరాయము ఏర్పడింది.అయితే నేడు 10వ తరగతి పరీక్షలు ఉండటముతో విద్యార్థులు నానా ఇబ్బందులు పడ్డారు.పేరుసోమల, గిద్దలూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు సంజామల సెంటరు కావడముతో పరీక్ష కు రావడానికి వారు నానా ఇబ్బందులు పడ్డారు. కనీసము శనివారము జరిగే పరీక్షకైన గోండ్రాగవాగులోని వాహనాన్ని తొలగించి విద్యార్థుల భవిషత్తును కాపాడాలని తల్లిదండ్రులు కోరారు.

## దస్తగిరి స్వామి అనుగ్రహము అందరికి కలుగాలి

**రేవనూరు(కోవెలకుంట్ల),ఏప్రిల్ 6,ప్రభాతవార్త :** రేవనపూరు హజరత్సయ్యద్ దస్తగిరి స్వామి అనుగ్రహము అందరికి కలుగాలని బనగానపల్లె మాజీ యంయల్ఎ బిసి జనార్దనరెడ్డి సతీమణి బిసి ఇందిరమ అన్నారు. గురువారము కోవెలకుంట్ల మండలంలోని రేవనూరు హరజత్ సమ్యద్ దస్తగిరి స్వామి దర్గాంలో బిసి ఇందిరమ్మ పూజలో పాల్గొన్నారు. బనగానపల్లె తెలుగు పేటకు చెందిన రాయపాటి వుశేని కుమారుడి కేశఖండన కార్యక్రమంలో బిసి ఇందిరమ్మ పాల్గొన్నారు,. ఈసందర్బముగా అమె మాట్లాడుతే సర్వ మతాలు పలికేది ఒక్కటే దేవుడు ఒక్కడే ఏమంటే వివిద రూపాల్లో భక్తులకు దర్శణము ఇస్తున్నాడు.అందుకే హజరత్ సయ్యద్ దస్తగిరి స్వామి అనుగ్రహము అందిరికి కలుగాలయని కోరుకున్నానని చెప్పారు.

## రాష్ట్రాభివృద్ధి తెదేపాతోనేసాధ్యం

– మాజీ ఎంఎల్‌బుడ్డారాజశేఖరరెడ్డి

**వెలుగోడు,ఏప్రిల్6,ప్రభాతవార్త :** వైయస్ఆర్‌కాంగ్రెస్‌పార్టీ పాలనవల్ల అన్నిరంగాల్లో వెనుకబడిన రాష్ట్రాన్ని అభివృద్ధిపరుచం తెలుగుదేశంపార్టీకే సాధ్యమని మాజి ఎంఎల్ఏ బుడ్డారాజశేఖరరెడ్డి అన్నారు.గురువారం వెలుగోడు పట్టణంలోని సుంకులమ్మవీధి,పెద్దదేవాలయం వీధిలో తెదేపానాయకులు ఇదేంఖర్మ కార్యక్ర మాన్ని నిర్వహించారు. మాజి ఎంఎల్‌బుడ్డారాజశేఖరరెడ్డి మాట్లాడుతూ వైకాపా పాలనలో సామాన్యుడు జీవించలేని



పరిస్థితి ఏర్పడందని తెలిపారు.నిత్యవసరధరల నియంత్రణలో,నిరుద్యోగులకుఉపాధి కల్పనలో, గ్రామాల్లో మౌళికవసతి కల్పించడంలో ముఖ్యమంత్రి వైయస్‌జగన్మోహన్‌రెడ్డి విఫలం చెందారనిఎద్దేవా చేశారు.రాష్ట్రాబివృద్ధికి పట్టం కట్టేందుకు ప్రజలు వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు అన్నారపుశేషిరెడ్డి,మాజిసర్పంచ్ అబ్దుల్‌కలాం, ఎల్లాల కృష్ణుడు,మోమిన్‌రసూల్,డా॥ జాకీర్‌వుశేన్,ఇదయత్అలిఖాన్, ఖలీల్అహ్మద్,శీలంరమణ, రమణారెడ్డి,విజయమోహన్‌రెడ్డి,రఘుస్వామిరెడ్డి,భూపాల్‌చౌదరి,మజిద్‌ఖాన్‌తదితరులుపాల్గొన్నారు.

## అంతర్ రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల్లో రంగారెడ్డి జిల్లాకు ప్రథమస్థానం

**జూపాడుబంగ్లా, ఏప్రిల్ 6 ,ప్రభాతవార్త :** తర్తూరు జాతర సందర్భంగా గురువారం అంతర్ రాష్ట్రస్థాయి సీనియర్ విభాగం (పెద్దబండ) ఎద్దులు బండలాగుడు పోటీల్లో తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా, నాదర్‌గూల్ గ్రామానికి చెందిన వృషబాలు ప్రథమ స్థానంలో నిలిచాయి. ఈ పోటీలను నందికొట్కూరు వైకాపా సీనియర్ నాయకులు బైరెడ్డి మల్లికార్జున రెడ్డి ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా నాదర్ గుల్ గ్రామానికి చెందిన ప్రసన్న కుమార్ రెడ్డి వృషభాలు 3,101.8 అడుగులు, నంద్యాల జిల్లా డోన్ మండలం కొత్తకోట గ్రామానికి చెందిన రైతు డాక్టర్ గురునాథ్ వృషభాలు 3048 అడుగులు, నంద్యాల జిల్లా బిల్లాపురం గ్రామానికి చెందిన రైతు భూమా గోవర్ధన్‌రెడ్డి వృషభాలు 2,780.3 అడుగులు, కోడుమూరు మండలం వల్కూరుకు చెందిన రైతు తిరుమలేష్ వృషభాలు 2762.4 అడుగులు, వైఎస్ఆర్ జిల్లా బాలుగారి పల్లెకు చెందిన రైతు రమణారెడ్డి వృషభాలు 2558.2 అడుగులు, జిల్లెల్ల కు చెందిన రైతు గొటికె నాగిరెడ్డి వృషభాలు 2468.2 దూరం లాగి ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గవ, ఐదవ, ఆరవ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ. 1లక్ష లు, రూ.80వేలు, రూ.60వేలు. రూ.40వేలు, రూ.20 వేలు,10వేలు నగదును నందికొట్కూరు మున్సిపల్ చైర్మెన్ దాసి సుదాకర్‌రెడ్డి, ఆలయ కమీటి చైర్మెన్ ప్రతాపరెడ్డి, జెడ్పీటీస్పీ పోచా జగదీశ్వర రెడ్డి కమీటి సభ్యులు అందజేశారు. పోటీలు తిలకించేందుకు రైతులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మున్సిపల్ చైర్మెన్ దాసి సుధాకర్‌రెడ్డి,జెడ్పీటిసి సభ్యులు పోచాజగదీశ్వర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి,ఆలయ కమిటీ చైర్మెన్ ప్రతాపరెడ్డి, సర్పంచ్ నాగిరెడ్డి, మాజీ జెడ్పీటీసి పుల్యాల నాగిరెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మెన్ తువ్వా రామకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ నాగార్జున రెడ్డి,వైస్ ఎంపిపి కృష్ణారెడ్డి,నాయకులు తిరుమలేశ్వరరెడ్డి, తరుణ్ కుమార్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, మద్దిలేటి రెడ్డి(నానిరెడ్డి), నరసింహయాదవ్, నరేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వ్యాఖ్యాతగా బుజూనూరు రామనాయుడు వ్యవహరించారు.

## అప్పర్ భద్రపై రాయలసీమకు అన్యాయం చేసిన కేంద్రం..

–మౌనం వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. –మానవ హక్కుల వేదిక డిమాండ్..

**కోసిగి, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** కర్ణాటకలోని తుంగభద్ర నదికి ఉపనది అయిన అప్పర్ భద్రపై రాయలసీమకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందని, దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం మౌనం వహించి ఇంకా తీరని నష్టం కల్గిస్తున్నదని మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షులు కోడి ఉరుకుందప్ప అన్నారు.. గురువారం ఆయన ఒక ప్రకటనలో విలేకర్లతో మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం అప్పర్ భద్రకు నీటి కేటాయింపులు జరపరాదని గతంలోనే కేంద్ర జల వనరుల సంఘానికి రాత పూర్వకంగా అభ్యంతరం తెలియజేసిందన్నారు.. అంతేకాక సుప్రీం కోర్టులో ఈ అంశం పెండింగ్‌లో ఉందన్నారు.. ఇన్ని అభ్యంతరాలను కాదని ఏక పక్షంగా



అన్ని నియమ నిబంధనలను ఉల్లంఘించి జాతీయ హోదా కల్పించడం కేంద్ర ప్రభుత్వ అనుసరించిన దుర్మార్గపు చర్యని విమర్శించారు.. నీటి తగాదాలను పరిష్కరించి ప్రజల ప్రయోజనాలను కాపాడవలసిన కేంద్ర ప్రభుత్వమే రాష్ట్రాల మధ్య ఉన్న నీటి సమస్యలను శాశ్వత సమస్యగా మార్చే ప్రయత్నం చేస్తోందన్నారు..ముఖ్యంగా ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా రాయలసీమకు ఎన్నికల వాగ్దానాలు తప్ప, అమలు మాత్రం కార్యరూపం దాల్చలేదన్నారు.. గత 40 సంవత్సరాల క్రితం ప్రారంభమయిన తెలుగు గంగా, హంద్రీనీవా,గాలేరు–నగరిలాంటి ప్రాజెక్టులు ఇంత వరకు పూర్తి కాలేదని విమర్శించారు.. ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసిన ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కూడా ముఖ్యమంత్రి అధికారం చేపట్టి నాలుగు ఏళ్లు గడుస్తున్నా ప్రాజెక్టుల గురించి జ్ఞాపకాలే ఉండడం లేదన్నారు.. చివరకు ప్రకృతి మార్పుల వల్ల వచ్చి వర్షపు నీటిని కూడా నిలబెట్టుకునే ప్రయత్నాలు చేయడం లేదన్నారు.. కర్ణాటక నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టులు రహస్యంగా నిర్మిస్తున్నవేమి కాదని బహిరంగానే జరుగుతున్న ప్రక్రియ అన్నారు..నీటి పంపకంలో సమస్యలు వచ్చినప్పుడు ప్రభుత్వాదినేతలు విజ్ఞతతో పరిష్కరించుకోవాలని, రాష్ట్రాల మధ్య నీటి సమస్యలు వచ్చినప్పుడు సామరస్యంగా పరిష్కారించాల్సిన కేంద్ర ప్రభుత్వమే సమస్యలను సృష్టిస్తే ఎలా అని ప్రశ్నించారు.. అందుకే అప్పర్ భద్ర సమస్యలపై రాయలసీమ నీటి సమస్యలమీద చర్చించుకునేందుకు ఈ నెల 9వ తేది ఆదివారం ఆదోని రాష్ట్ర స్థాయి బహిరంగ సభను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.. ఈ సభకు మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు యుజీ.శ్రీనివాసులు, ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటి సభ్యులు చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాష, రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకులు ఆదినారాయణ, రాయలసీమ కో–ఆర్డినేటర్ రాజు, తదితరులు పాల్గొంటారని తెలిపారు..

## చలివేంద్రాన్ని ప్రారంభించిన కోడుమూరు సి.ఐ

**కోడుమూరు,ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** స్థానిక అంబేద్కర్ విగ్రహం దగ్గర గురువారం మధ్యాహ్నం కోడుమూరు సి.ఐ శ్రీధర్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండుతున్న ఎండలకు ప్రధానరహదారుల గుండా వెళ్లే పాదచారుల దప్పిక తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడ అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు పంచాయతీ కార్యదర్శి అజయ్‌భాస్కర్‌రెడ్డి,ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంధ్రయ్య,రాయలసీమ జర్నలిస్టు ఫోరమ్ ప్రధానకార్యదర్శి చంద్రశేఖరరెడ్డి,సిపిఐ నాయకులు




రాజు,టీడీపీ నాయకులు ఎల్లప్ప,గ్రామస్థులు బుగిడే వెంకటేశ్వర్లు,బుగిడే మాధవస్వామి,స్థానిక మిడియా మిత్ర బృందం తదితరులు పాల్గొన్నారు.

## తర్తూరు జాతరలో నోరూరించే సీకులు..!

**జూపాడుబంగ్లా, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** మందేస్తూ.. సీకులు తింటూ.. చిందెయ్‌రా అంటూ ప్రజలు తర్తూరు జాతరలో ఎంజాయ్ చేస్తున్నారు. ఈ జాతర అంటేనే ముందుగా గుర్తుకు వచ్చేది కడ్డీమాంసం(సీకులు). వీటిని తినేందుకు సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు తరలివస్తారు. జాతరకు వచ్చిన వారిలో 90శాతం మంది సీకులు ముట్టనివారు వుండరనడంలో అతిశయోక్తి కాదు. అంతటి పేరుంది మరి ఈ సీకులకు. ఓవైపు నోరూరుంచే సీకులు కాలుతుంటే మరోవైపు పూటుగా మద్యం సేవిస్తూ వేడి సీకును నమిలి మద్యం బాబులు తాగరా అన్నా.. తాగి ఊగరా అన్నా.. అంటూ ఎంజాయ్ చేస్తున్నారు. ముఖ్యంగా సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు సీకులు కాలుతూనే వుంటాయి. ఒక్కో వ్యక్తి ఒక కిలో సీకులు తింటాడంటే అవి ఎంత రుచిగా వుంటాయో అర్థం అవుతుంది. జాతరకు వచ్చిన మహిళలు, పిల్లలకు ఇక్కడ ప్రత్యేకంగా తయారు చేసిన తినుబండారాలను(స్వీటు) విక్రయిస్తారు. పదుల సంఖ్యలో ఈ దుకాణాలు అందంగా అలంకరిస్తారు. జాతరలో మాంసపు కడ్డీలకు ఎంత గిరాకీ వుంటుందో అదే తరహాలో స్వీట్లకు అంతకు రెండంతలు గిరాకీ వుంటుంది. ఒక్కసారి ఈ జాతరను తిలకించి రుచి చూసిన వారు ఈ జాతరను మరువరు, మరి రావల్సిందే అన్న నానుడి లేకపోలేదు. ఇవన్నీ కావాలంటే తర్తూరు జాతరకు రావాల్సిందే..

## జగనన్నే మా నమ్మకం

**ఆత్మకూరు,ఏప్రిల్06,ప్రభాతవార్త :** శ్రీశైల నియోజక వర్గ శాసన సభ్యులు శ్రీ శిల్పా చక్రపాణిరెడ్డి ఆదేశాల మెరకు ఆత్మకూరు మున్సిపాలిటి పరిదిలోని అన్నిసచివాలయాలో 7 వ తేదినుండి జరగభోయే బృహత్తర కార్యక్రమం జగనన్నె మానమ్మకం మొదలౌతున్న సందర్భంగా ముందుగా సచివాలయ కన్వినర్లని గృహసాదరులను మరియు వాలంటరీలను సమన్వయపరుచుకొని మీటింగ్ ఏర్పాటు చేసుకోవడం జరిగింది. చైర్‌మెన్ మరియు జెసియస్ ఇంచార్జిలు సభను ఉద్దేశించి మాట్లాడుతుప్రతిఇంటికి వెళ్ళి మా ప్రభుత్వము గత ప్రభుత్వానికి మద్య వ్యత్యాసము మరియు మా ప్రభుత్వంలో అందుతున్నా సంక్షేమ పథకాల గురించి సవినయంగా వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌మెన్ ఆసియామారప్ ఆత్మకూరు జేసిఎప్ ఇంచార్జి సుల్తాన్ వైసిపి నాయకులు తదితరులు పాల్గోన్నారు.

## ఘనంగా కరిపామన్నస్వామి రథోత్సవ వేడుకలు

**కౌతాళం, ఏప్రిల్06, ప్రభాతవార్త ;** మండలంలోని మ్యాళిగనూరు రామలింగేశ్వర ఆలయం, డమలదిన్నె గ్రామంలో శ్రీ కరిపామన్నస్వామి రథోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం రథోత్సవానికి పూజలు చేసి రథోత్సవ వేడుకలను నిర్వహించారు. రథోత్సవ కార్యక్రమ్నాన తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

## అయ్యకొండలో ఘనంగా అంపయ్య పౌర్ణమి వేడుకలు

**గోనెగండ్ల ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** మండల పరిధిలోని అయ్యకొండ గ్రామంలో గురువారం అంపయ్య పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ చింతలామిని నల్లారెడ్డి స్వామి వారి ప్రభోత్సవం కన్నుల పండుగగా సాగింది. గ్రామ శివార్ల నుంచి చింతలాముని స్వామి దేవాలయం వరకు ప్రభోత్సవంను భక్తులు భక్తి శ్రద్దలతో కొనసాగించారు.భక్తులు పెద్ద ఎత్తున ప్రభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు.స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు.స్వామి వారికి ప్రత్యేక పూలతో అలంకరించారు.ఆకుపూజ,తులసీ పూజ, మహామంగళహారతి నిర్వహించారు.వందలాది మంది భక్తులు ఈ ప్రభోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు.సాయంత్రం భోజన వసతి ఏర్పాటు చేశారు.రాత్రి భజన కార్యక్రమాన్ని నిర్వహకులు ఏర్పాటు చేశారు.

## ముస్లీం సోదరులకు ఇఫ్తార్ ఏర్పాటు చేసిన చౌదరిబసవ

**కౌతాళం, ఏప్రిల్06, ప్రభాతవార్త ;**

రంజాన్‌మాసం సందర్భంగా కౌతాళం ముస్లీం సోదరులకు చౌదరిబసవ స్వగృహంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మండలకేంద్రమైన కౌతాళంలోని నూరాని మజీద్, జామియా మస్జీద్, మదీనా మజీద్, అక్సా మజీద్ వచ్చిన ముస్లీం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ రంజాన్ మాసంలో కులమతాలకు అతీతంగా ఇఫ్తార్ విందు



ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉందని చౌదరి బసవ పేర్కొన్నారు. ఆ అల్లా కృప ప్రతిఒక్కరి మీద ఉండాలని మండల ప్రజలు సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని అల్లాను ప్రార్థించారు. ఈ ఇఫ్తార్ విందులో భారీ సంఖ్యలో ముస్లీం సోదరులు, మతపెద్దలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మండల నాయకులు దేశాయ్ ప్రహ్లాద్ ఆచారి, ఎంపీపీ బుజ్జిస్వామి, సర్పంచ్ పాల్‌దినకర్, గోడం రాజు, సమద్, రాజమహ్మద్, భీమేష్, బసవ, రామంజి పాల్గొన్నారు.

## సైబర్ నేరాలకు కేంద్రంగా మారిన అన్‌లైన్‌యాప్‌లను నిషేదించాలి

**కర్నూలు మున్సిపల్, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:** అన్‌లైన్ డేటింగ్, లివింగ్, ఫ్రెండ్‌షిప్ యాప్‌ల ద్వారా యువతను అకర్శించి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న యాప్‌లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం చంద్ర రాజేశ్వర్‌రావు భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో లెనిన్‌బాబు మాట్లాడుతూ ఫేస్‌బుక్, ట్విట్టర్, ప్రముఖ సోషల్ మీడియా, ప్రధానంగా స్టేస్టర్ గ్రూప్‌ల్లో అశ్లీలతను పెంచే విడియోలు, డేటింగ్ యాప్‌ల ద్వారా అమాయక యువతను టార్గెట్‌చేసి నగ్న విడియోలతో బెదిరిస్తు లక్షలాది రూపాయలు వసులు చేయడంతోపాటు మీరు డబ్బులు ఇవ్వలేని పక్షంలో మీ ఫ్రెండ్స్‌కు విడియోలు పంపుతామని బ్లాక్‌మెయిల్‌చేయడం ద్వారా రాష్ట్రంలో అనేక మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు కె శ్రీనివాసులు, ఎఐటియుసి నగర కార్యదర్శి జి చంద్రశేఖర్, ఎఐవైఎఫ్ నగర అధ్యక్షులు బాలయ్య, నగర నాయకులు చంటి, శేషన్న, హుస్సేన్ బాష పాల్గొన్నారు.

## మైపర్‌లో ఫార్మసీ కళాశాలలో ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

**కర్నూలు విద్య, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:** కర్నూలు నగరంలోని మైపర్ ఫార్మసి కళాశాలలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈవేడుకలకు జెఎన్‌టియు యూనివర్శిటి యూసి ప్రొఫెసర్ జి రంగా జనార్థన్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రొఫెసర్ రంగా జనార్థన్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టరు ఆదిమూలపు సురేష్, అకాడమిక్ డైరెక్టర్ డా.స్టెలా సతీష్, ప్రిన్సిపాల్ డా.రవికుమార్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ డా.కె సురేష్, కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలందరు సుభిక్షంగా ఉండాలి

– ఆలూరు తెదేపా మాజీ ఇంచార్జ్ వీరభద్రగౌడ్

**హొళగుంద,ఏప్రిల్ 6,ప్రభాతవార్త :**

ప్రజలందరు సుఖసంతోషాలతో,సుభిక్షంగా ఉండాలని శ్రీ పోతులింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టినట్లు ఆలూరు తెదేపా మాజీ ఇంచార్జ్ వీరభద్రగౌడ్ అన్నారు. గురువారం సాయంత్రం గజ్జహళ్లి గ్రామంలో వెలసిన శ్రీ పోతులింగేశ్వర స్వామి రథోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయనకు గ్రామ నాయకులు,కార్యకర్తలు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం దేవాలయంలో కొలువైన స్వామి వారిని కార్యకర్తలు,నాయకులతో కలిసి దర్శించుకున్నారు. తదనంతరం వీరభద్రగౌడ్‌ను శాలువా,పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలూరు మాజీ మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ పంపాపతి,తెదేపా సీనియర్ నాయకులు ఉవ్వలూరు కాడసిద్దప్ప,మాజీ మండల కన్వినర్ ఈరన్నగౌడ్,బసవరాజుగౌడ్, లక్ష్మన్న,వీరేష్,గజ్జహళ్లి నాయకులు కురువ బొజ్జప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల నిర్మాణాలకు స్థల పరిశీలన

– టీటీడీ ఆధ్వర్యంలో ఆలయాల నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు

**కౌతాళం, ఏప్రిల్06, ప్రభాతవార్త ;**

టీటీడీ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని బడుగు, బలహీనవర్గాల కాలనీల్లో కొత్తగా ఆలయ నిర్మాణాలు చేపట్టేందుకు జిల్లా దేవదాయశాఖ సహాయక కమిషనర్ ఆదిశేషనాయుడు గురువారం స్థల పరిశీలన చేశారు. ఇప్పటికేప దరఖాస్తు చేసుకున్న మండలంలోని వివిధ గ్రామాలతో పాటు మండలకేంద్రమైన కౌతాళంలోని ఎస్సీ కాలనీలో గల బసవలింగేశ్వరస్వామి ఆలయం, బీసీ కాలనీలో గల గంగాపుత్ర, భీరలింగేశ్వర, సుంకలమ్మదేవి, త్రయంబకేశ్వరస్వామి ఆలయాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీటీడీ కృపంచిన ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత దేవాలయ నిర్వాహకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేవదాయ భూములు అన్యాక్రాంతమైతే తమదృష్టికి తీసుకురావాలన్ననరు. అనంతరం వైకాపా మండల కన్వీనర్ ప్రహ్లాద ఆచారి మాట్లాడుతూ ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో దేవదాయశాఖ దృష్టికి తీసుకెళ్లి మండలంలోని వెనకబడిన ప్రాంతాల్లో దేవాలయ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాల్ దినకర్, వైస్ ఎంపీపీ రామలింగస్వామి, మాజీ సర్పంచ్ అవతారం, వైస్ సర్పంచ్ తిక్కయ్య, ఉరుకుంద దేవస్థానం పాలకసభ్యులు యంకోబా, నాయకులు ఉమాపతి, సమద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రథోత్సవ ఉత్సవాలు

– భారీగా తరలివచ్చిన భక్తులు – అంగరంగ వైభవంగా సాగిన ఉత్సవాలు

**హాలహార్వి,ఏప్రిల్ 6,ప్రభాతవార్త :** మండల పరిధిలోని విరుపాపురం గ్రామంలో గురువారం శ్రీ బలుగోట బసవేశ్వర స్వామి,హాలహర్విలో శ్రీ గోవిందమ్మ రథోత్సవ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉత్సవాల సందర్భంగా ఆంధ్ర,కర్ణాటక గ్రామాల నుంచి భక్తులు వందలాది మంది తరలివచ్చారు. ఉదయం స్వామి వారికి ఆకుపూజ,పంచామృతాభిషేకం, పాలాభిషేకం, జలాభిషేకం,గణపతి పూజ,



రుద్రాభిషేకం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నందికోలు ప్రదర్శనతో జయజయ పట్టాదయ్య స్వామి నామస్మరణతో భక్తులు విన్యాసాలు చేశారు. నందికోలు నృత్యం,ఖడ్గ ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఉత్సవ మూర్తులను పల్లకిలో ఊరేగిస్తు పూలవర్షం కురిపించారు. సాయంత్రం పౌరాణిక ప్రదర్శన, నందికోలు నృత్యం నిర్వహించారు. మఠం పీఠాధిపతి శంభులింగమరిదేవరు,గ్రామ పెద్దలు సిద్దు స్వామి,పదదయ్య స్వామి,రథోత్సవానికి పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నందికోలు,పల్లకి సేవ రథోత్సవం చుట్టు ప్రదక్షిణలు చేశారు. భోగొటయ్య,శంభులింగ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ మూర్తులను రథంపై ఉంచి భక్తుల జయజయ ధ్వనుల మద్య రథ చక్రాలు ముందుకు కదిలాయి. ఎదురు బసవన్న గుడి వరకు రథాన్ని లాగి అక్కడ బసవన్నకు పూజలు చేసి తిరిగి రథాన్ని యధాస్థానానికి చేర్చారు. ఆలయ కమిటీ వారు భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండ హాలహర్వి ఎస్ఐ విజయ్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు. విరుపాపురం సర్పంచ్ మోక సిద్దమ్మ,హాలహర్వి సర్పంచ్ మల్లికార్జున,మండల కన్వినర్ భీమప్పచౌదరి,వైసిపి నాయకులు మోక మల్లికార్జున తదితరులున్నారు.

## కన్నుల పండుగగా రథోత్సవం

**హొళగుంద,ఏప్రిల్ 6,ప్రభాతవార్త :** మండల పరిధిలోని గజ్జహళ్లి గ్రామంలో వెలసిన శ్రీ పోతులింగేశ్వర స్వామి రథోత్సవ కార్యక్రమం గురువారం సాయంత్రం అశేష భక్తజనం మద్య కన్నులపండువగా అంగరంగ వైభవంగా జరిగింది. దేవాలయంలో కొలువైన శ్రీ పోతులింగేశ్వర స్వామికి ఉదయం నుండే భక్తులు వేద పండితుల మంత్రోచ్ఛరణలు,మంగళవాయిద్యాల మద్య భక్తులు డప్పు చప్పుళ్ల మరియు మహిళల కళశాలతో రథోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. భక్తులు చేసిన పిండి వంటలను స్వామి వారికి నైవేద్యంగా సమర్పించి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. రథోత్సవం సందర్బంగా గ్రామం మొత్తం బంధువులు,ఆడ పిల్లలతో ప్రతి ఇళ్లు కిటకిటలాడింది. రథోత్సవంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండ ఎస్ఐ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆరుబట్ల నాగమ్మ,సర్పంచ్ తనయుడు గిరిమల్ల,వైస్ ఎంపిపి మహదేవమ్మ,ఎంపిటిసి కెంచప్ప,వైకాపా నాయకులు ఇమామ్ హుస్సేన్,మాజీ సర్పంచ్ కురువ భీమలింగ,సింగిల్‌విండో చైర్మన్ మేలిగిరి మల్లికార్జున పాల్గొన్నారు.

## మా నమ్మకం నువ్వే జగనన్న పోస్టర్లు ఆవిష్కరణ

**తుగ్గలి,ఏప్రిల్ 6,ప్రభాతవార్త :** మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నేటి నుండి వాలంటర్లీ,గృహసారథులు అన్ని గ్రామాల్లో నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జిట్టా నాగేష్ సూచించారు. గురువారం మండల పరిధిలోని జి ఎర్రగుడి గ్రామ సచివాలయంలో వాలంటరీలు,సచివాలయ కన్వినర్లు,గృహ సారథులతో సమీక్ష సమావేశం నిర్వహించి మా నమ్మకం నీవే జగనన్న పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహసారథులు ఇంటింటికి వెళ్లి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి,సంక్షేమ పథకాలు వివరించడంతో పాటు ఇంటింటికి స్టిక్కర్లను అతికించాలని సూచించారు. నేటి నుండి 14వ తేదీ వరకు జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రతి సచివాలయంలో ప్రతి 50ఇళ్లకు ఒక వాలంటరీ,3గృహసారథులు బృందాలుగా ఏర్పడి ప్రతి ఇంటికి మన ప్రభుత్వంలో ఎన్ని సంక్షేమ పథకాలు వచ్చాయి గత ప్రభుత్వంలో ఎంత లబ్ది చేకూరింది అని తెలుసుకుని జగనన్నే మా భవిష్యత్తు పుస్తకంలో నమోదు చేయాలని సూచించారు. ప్రతిరోజు 8లేక 9ఇళ్లను దర్శించి సంక్షేమ పథకాలపై చర్చించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి పులికొండ నాయక్,మాజీ జడ్‌పిటిసి నారాయణ నాయక్,వైసిపి నాయకులు దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## గ్రంథాలయాల అభివృద్ధిలో ప్రజలు బాగ్యస్వామ్యం కావాలి

**గోనెగండ్ల ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** గ్రంథాలయాల అభివృద్ధికి ప్రజలు బాగస్వామ్యం కావాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుభాస్‌చంద్రబోస్ పిలుపునిచ్చారు.గురువారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని గ్రంథాలయంలో గ్రంథాలయ అభివృద్ధి ప్రజలు బాగస్వామ్యం అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంకు జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుభాస్ చంద్రబోస్ ముఖ్యఅతిథిగా వచ్చారు.స్థానిక గ్రంథాలయ అధికారి గిరిబాబు అధ్యక్షత వహించారు.ఈ స ందర్భంగా సుబాస్‌చంద్రబోస్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు గ్రంథాలయంకు రావాల్సిన సెస్సు పన్నులు సకాలంలో కడితే మరింత అభివృద్ధి చెందుతాయని అన్నారు. యువకులు,విద్యార్థులు గ్రంథాలయ సభ్యత్వంను తీసుకోవాలని కోరారు.గోనెగండ్ల గ్రంథాలయ భవనం శిథిలావస్థలో ఉన్నది కావున వచ్చే బడ్జెట్‌లో నూతన భవన ంకు రూ.40లక్షలు కేటాయిస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు మురళినాయుడు,ఉసేన్‌పటేల్,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## కమనీయం..కరివీరభద్రస్వామి రథోత్సవం

**కల్లుదేవకుంట(మంత్రాలయం),ఏప్రిల్ 6,ప్రభాతవార్త:** మండల పరిధిలోని కల్లుదేవకుంట గ్రామంలో వెలసిన శ్రీ కరివీరభద్రస్వామి మహా రథోత్సవం గురువారం కమనీయంగా జరగింది.ఉదయం నుండే స్వామివారికి ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆకుపూజ,కుంకుమార్చన,మహా మంగళ హారతి తదితర పూజలు నిర్వహించి భక్తులు స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం గ్రామ పురవీధుల గుండా స్వామి వారిని రథోత్సవంపై ఉంచి ఆశేష భక్తుల మద్య ఊరేగించారు.మేళతాళాలు,మంగళ వాయిద్యాలు,బాణసంచాలతో ఈ మహా రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు.ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలైన కె.రాఘవరెడ్డి,రఘునాథ్‌రెడ్డి,శివారెడ్డి,మల్లికార్జునరెడ్డి,యువ నాయకులు విఖ్యాత్‌రెడ్డి ఆధ్వర్యంలో రథోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సిఐ శ్రీనివాసులు,ఎస్ఐ వేణుగోపాల్‌రాజు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మా నమ్మకం నువ్వే జగనన్న

**మంత్రాలయం,ఏప్రిల్ 6,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం గోడ పత్రికలను వైసిపి యువజన నాయకులు వై.ప్రదీప్‌రెడ్డి గురువారం విడుదల చేశారు.ఈ సందర్భంగా ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 7వ తారీఖు నుండి 20వ తారీఖు వరకు సుమారు 14 రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.నియోజకవర్గంలోని అన్ని గ్రామాల కార్యకర్తలు, నాయకులు,గృహ సారధులు,సచివాలయ కో–కన్వీనర్లు అందరూ తప్పకుండా గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్ళి సంక్షేమ పాలనపై ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పురుషోత్తంరెడ్డి,ఇంఛార్జ్ విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణి

**నందవరం, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన నందవరం పంచాయితీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పంపాపతి స్వామి జాతరను పురష్కరించుకొని జంబు కరివసరన్న గౌడ్ జ్ఞాపకార్థంగా జే సంపత్‌కుమార్ గౌడ్, శివారెడ్డి గౌడ్ దస్తులు పంపిణి చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివి అన్నారు. ప్రతిఒక్కరు కూడ వారి సేవలను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎల్లా గౌడ్, గొల్లా వీరేష్, ఆదాము, శాంతిరాజు బతుకమ్మ ఆనందులు పాల్గొన్నారు.

## యువగళంకు కదం తొక్కనున్న తెదేపా శ్రేణులు

**నంద్యాల టెక్కె, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:** తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళంకు మద్దతుగా నంద్యాల జిల్లా కేంద్రం నుంచి 16 వాహనాల్లో బయలుదేరి వెళ్లి లోకేష్‌కు మద్దతు తెలపనున్నట్లు తెలుగుదేశం ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దికెర కైలాష్ తెలిపారు. గురువారం తెదేపా నాయకులతో కలిసి తెదేపా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మద్దికెర కైలాష్ మాట్లాడుతూ మాయమాటలు చెప్పి అదికారంలోకి వచ్చిన వైకాపా పార్టీని నమ్మొద్దని జగనన్న మా భవిష్యత్తు మా నమ్మకం అనే నినాదంతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. వైసీపీ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు కొత్త అవతారమెత్తి నియోజకవర్గాల్లో పర్యటించాలని చూడడం సిగ్గుచేటని అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలు నేరవేర్చకుండా ప్రజల మధ్యకు వెళ్లాలని చుసు‌్తన్నారని వారి కుయుక్తులను ప్రజలు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఇంధన ధరలు, నిత్యావసర ధరలు రోజు రోజుకు పెరిగిపోతున్నా కేంద్రాన్ని ప్రశ్నించకుండా వైకాపా ప్రభుత్వం మౌనం వహించడం చుస్తే కేసులు మాఫీచేసుకోవడానికి వారి ముందు దాసోహం అయినట్లు తెలుస్తోందన్నారు. ఈతుగ్లక్ పాలన నుంచి విముక్తి పొంది తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలనే తపనతో కార్యకర్తలు అధికారమే ధ్యేయంగా పనిచేయాలని పేర్కొన్నారు. సమావేశంలో తెదేపా నాయకులు శివశంకర్, భూపాల్, సూరబోయిన పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైద్య రంగానికి పెద్దపీట వేస్తున్న వైసీపీ ప్రభుత్వం



**బనగానపల్లె, ఏప్రిల్6, ప్రభాతవార్త:** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేస్తుందని అందులో భాగంగానే ప్రభుత్వ సుపత్రులలో నాడు-నేడు పథకం ద్వారా మౌలిక వసతులను మెరుగుపరుస్తుందని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తన స్వగృహం నందు బనగానపల్లె నియోజకవర్గంలోని ఉప్పలపాడు, పలుకూరు గ్రామాల ప్రాథమిక వైద్యశాలలకు చెందిన 104 వైద్య వాహనాలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు. ముందుగా వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జెండా ఊపి 104వాహనాలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని 104 వైద్య వాహనాలను ప్రతి గ్రామానికి నెలలో రెండుసార్లు వెళ్లి ప్రజలకు వైద్యసేవలు అందించడానికి అంబులెన్సులు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఈ 104వాహనాల వల్ల ప్రతి ఇంటికి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అనే కార్యక్రమాన్ని మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రతి ఇంటిలోని ప్రతి సభ్యుడు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతోనే ముందుకు వెలుతున్నారని చెప్పారు. ఇందులో భాగంగానే ఈ 104వైద్య వాహనాలలో బీపీ, షుగర్, జ్వరం లాంటి ఎన్నో చికిత్సలు డాక్టర్ పర్యవేక్షణలో వైద్యసేవలు అందించడం జరుగుతుందని దీనిని ప్రతి గ్రామంలోని ప్రతి పౌరుడు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేయడం జరుగుతుందని అందులో భాగంగానే నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వాసుపత్రులకు మహర్దశ కల్పించడం జరుగుతుందని చెప్పారు. నిత్యం ప్రజల కోసం కష్టపడే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంటి నాయకుడిని ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కూడా వారిని మరవిపోకుండా మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాలిరెడ్డి, వైసీపీ నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి, ఉప్పలపాడు, పలుకూరు గ్రామాల ప్రాథమిక వైద్యశాలల డాక్టర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# 8న పట్టుబడిన వాహనాలకు వేలం పాటలు నిర్వహిస్తాం ; డీయస్పీ వినోద్‌కుమార్

ఆదోనిటౌన్, ఏప్రిల్06, (ప్రభాతవార్త) ; జిల్లా ఎస్పీ సిద్ధార్థకౌశల్ ఆదేశాల మేరకు ఆదోని సబ్ డివిజన్‌లోని ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేయబడిన వాహనాలకు ఈనెల 8, 9వ తేదీల్లో ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆవరణలో వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు డీయస్పీ వినోద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం డీయస్పీ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా డీయస్పీ మాట్లాడుతూ మొత్తం 181 వాహనాలకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో ఫోర్ వీలర్స్ 02, త్రీవీలర్స్ 10, టూ వీలర్స్ 169 ఉన్నాయన్నారు. వేలం పాటల్లో పాల్గొనే వారు ప్రవేశ రుసుము చెల్లించి పాల్గొనాలన్నారు. ఆదోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 16, ఆదోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 08, ఆదోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 02, ఆదోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో 02, గొనెగండ్ల స్టేషన్ పరిధిలో 13, ఇస్వీ పోలీస్‌స్టేషన్ పరిధిలో 09, కోసిగి పోలీస్‌స్టేషన్ పరిధిలో 26, కౌతాళం పోలీస్‌స్టేషన్ పరిధిలో 66, మాధవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 09, మంత్రాలయం పోలీస్‌స్టేషన్ పరిధిలో 02, నందవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 08, పెద్దకడబూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 05, పెద్దతుంబళం పోలీస్‌స్టేషన్ పరిధిలో 05, ఎమ్మిగనూరు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 09, ఎమ్మిగనూరు టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 01 ఉన్నట్లు చెప్పారు. మొత్తం 181 వాహనాలకు వేలం పాటలు నిర్వహిస్తామన్నారు.

# 10వతరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన

**- ఎంఐఎస్ అండ్ ప్లానింగ్ కో-ఆర్డి నేటర్**

**పగిద్యాల, ఏప్రిల్ 6,ప్రభాతవార్త :** పగిద్యాలలోని 10వతరగతి పరీక్షా కేంద్రాలను నంద్యాల జిల్లా సమగ్ర శిక్ష నుండి ఎంఐఎస్ అండ్ ప్లానింగ్ కో-ఆర్డినేటర్ మనోహర్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. అయన పగిద్యాల జెడ్పీపాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షాకేంద్రాన్ని పరిశీలించారు. ఎంతమంది పరీక్షలకు విద్యార్థులు హాజర్యారనీ అడుగగా 194మంది హాజరు అయ్యారనీ ఛీఫ్ సూపరింటెండెంట్ సలీంభాష, డిపార్టుమెంటల్ అధికారి మహ్మద్‌రఫీ సమాధానం ఇచ్చారు. అదేవిధంగా మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన 10వ తరగతి పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. 10వతరగతి విద్యార్థులు ఎంతమంది పరీక్షలకు హాజరయ్యారు, ఏమైనా గైర్హాజరయ్యారా అని ఛీఫ్ సూపరింటెండ్ంట్ నాగ రమేష్, డిపార్టుమెంట్ అధికారి దరగయ్య, కస్టోడియన్ వెంకటేశ్వర్లును ప్రశ్నించగా 225 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావలసి వుండగా ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారనీ తెలిపారు. పగిద్యాల జెడ్పీపాఠశాల, మోడల్ స్కూల్‌లో రెండు పరీక్షా కేంద్రాలలో పరీక్షలు ప్రశాంతంగా జరగడంతో నంద్యాల సమగ్ర శిక్ష నుండి ఎంఐఎస్ అండ్ ప్లానింగ్ కో-ఆర్డినేటర్ మనోహర్‌రెడ్డి సంతృప్తిని వ్యక్తం చేశారు. అయన వెంట డిప్యూటీ తహశీల్దార్ మహబూబ్ భాష పాల్గొన్నారు. పరీక్షా కేంద్రాలవద్ద ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జు అధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# శ్రీశైలం మల్లన్నను దర్శించుకున్న ప్రెస్ ఆకాడమి ఛైర్మన్

**శ్రీశైలంప్రాజేక్టు,ఏప్రిల్06,ప్రబాతవార్త :** శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లను గురువారంనాడు ఏపి ప్రెస్ ఆకాడమి ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు సతిసమేతంగా శ్రీశైలంకు చేరుకున్నారు.ఆలయ దర్శనార్థం చేరుకున్న వారికి రాజగోపురం వద్ద ఏఈఓ ఐ.ఎన్.వి.మోహన్,ప్రజాసంబందాల ఆదికారి టి.శ్రీనివాసరావు సాదర స్వాగతం పలికారు.అనంతరం రత్నగర్బగణపతిస్వామి వారిని దర్శించుకున్నారు.తదుపరి శ్రీస్వామిఅమ్మవార్ల ఉభయ దేవాలయాలను దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు.తదుపరి అమ్మవారి ఆలయ ప్రాకార మండపంలో అర్చకస్వాములు, వేదపండింతులు వేదశీర్వాచనాలు వల్లించి తీర్థప్రసాదాలను అందజేసారు.తదుపరి ఏఈఓ మోహన్ శేషవస్త్రలతో సత్కరించి లడ్డూ ప్రసాదాలను అందజేసారు.

# పగిద్యాల మండల విద్యాశాఖ కార్యాలయం సందర్శించిన

**- ఎంఐఎస్ అండ్ ప్లానింగ్ కో-ఆర్డినేటర్ మనోహర్‌రెడ్డి**

**పగిద్యాల, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :**పగిద్యాల మండల విద్యాశాఖ కార్యాలయాన్ని గురువారం నంద్యాల జిల్లా సమగ్ర శిక్ష నుండి ఎంఐఎస్ అండ్ ప్లానింగ్ కో-ఆర్డినేటర్ మనోహర్‌రెడ్డి సంద్శించారు. మండల కేంద్రమైన పగిద్యాల జెడ్పీపాఠశాల, మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన 10వ తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించడం జరిగిందనీ, ప్రశాంతంగా పరీక్షలు జరుగుతున్నాయనీ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సుభాన్ పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాలకు వైద్య సదుపాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**- వైసిపి సీనియర్ నాయకులు సీతారామిరెడ్డి**

**కాచాపురం(మంత్రాలయం),ఏప్రిల్ 6,ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలకు సైతం వైద్య సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వైసిపి సీనియర్ నాయకులు వై.సీతారామిరెడ్డి అన్నారు.గురువారం మండల పరిధిలోని కాచాపురం గ్రామంలో నూతన 104 వాహనాన్ని జెండాఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగానికి అధిక శాతం నిధులను కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు.కాబట్టి ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత వైద్య సేవలను ఆయా గ్రామాల ప్రజలు తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారిణి హేమలత,మండల వైద్యాధికారిణి డా.వై.గోవిందమ్మ,డా.సురేష్,ఎంపిహెచ్ఈఓ వెంకటేశ్వర్లు, ఎంపిహెచ్ఎస్‌లు మాధవస్వామి,భారతి,ఏఎన్ఎం జయమ్మ,నాగేశ్వరి,ఎంఎల్‌హెచ్‌పి ప్రభావతి,ఆశావర్కర్లు జయమ్మ,మల్లేశ్వరి,కవిత,ప్రభులమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నిత్యన్నదాన వితరణకు పలువురు దాతలు విరాళం

**శ్రీశైలంప్రాజెక్టు,ఏప్రిల్06,ప్రభాతవార్త :** శ్రీశైలం మహపుణ్యక్షేత్రంలో దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యన్నదాన వితరణకు వెట్లూరు వాస్తవ్యులు గుట్ట సోమసూర్యబ్రహ్మం కుటుంబ సభ్యులు రూ.1,01,116/-ల విరాళమును,అదే విధంగా ఒంగోలు వాస్తవ్యులు బి.రామకృష్ణ కుటుంబ సభ్యులు రూ.1,01,116/-ల విరాళమును,అదే విధంగా విజయవాడ వాస్తవ్యులు ఎలిస్వరపురం కృష్ణప్రసాద్ కుటుంబ సభ్యులు రూ.1,00,116/-ల విరాళమును ముగ్గురు దాతలు విడివిడిగా దేవస్థానం సహయ కార్యనిర్వహణాదికారి ఫణిధర్‌ప్రసాద్‌కు అందజేసారు.ముందుగా శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించుకోని అనంతరం విరాళం అందజేసారు.తదుపరి దాతలను శ్రీస్వామివార్ల శేషవస్త్రాలతో సత్కరించి లడ్డూ ప్రసాదాలను,శ్రీస్వామిఅమ్మవార్ల చిత్రపటాన్ని దాతలకు అందజేసారు.

# తెలుగు రాష్ట్రలలో టిడిపి అధికారంలోకి వస్తుంది:ముప్పిడి గోపాల్

**శ్రీశైలంప్రాజేక్టు,ఏప్రిల్06,ప్రబాతవార్త :** ఆంధ్ర,తెలంగాణా రెండు రాష్ట్రలలో టిడిపి అధికారంలోకి వస్తుందని ఉమ్మడి రాష్ట్రలా మార్కెట్ చైర్మన్‌ల సంఘం ఆద్యక్షుడు,ఇన్‌పర్మేషన్ టెక్నాలజీ ఏపి,టిఎస్,డైరక్టర్,సికింద్రబాద్ కంటోన్మేట్ నియేజకవర్గం కోఆర్డినేటర్ టిడిపి నాయకులు ముప్పిడి గోపాల్ జోస్యం చెప్పారు.ఈక్రమంలో వారు మొదటగా తిరుమల తిరుపతి కలియుగ వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం జరిగిందని తెలిపారు.తదుపరి శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామి అమ్మవార్లను దర్శించుకోవడం జరిగిందని తెలిపారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా అంధ్రప్రదేశ్‌లో నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని,తెలంగాణాలో కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ముఖ్యమంత్రి కావాలని అ తిరుమల వేంకటేశ్వర స్వామిని,శ్రీశైలం భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను దర్శించుకోని వేడుకోవడం జరిగిందని వివరించారు.రెండు తెలుగు రా ష్ట్రల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని,పాడి పంటలతో తులతూగాలని ఆ భగవంతున్ని కోరుకోవడం జరిగిందని తెలిపారు.ముఖ్యంగా బడుగు బలహీన వర్గాల కొరకు తెలుగుదేశం పార్టిని స్థాపించిన నాయకుడు మన ప్రియతమ నేత కీర్తిశేషులు నందమూరి తారక రామరావు అని,మహిళలకు సమాన హక్కు కలిగించిన నాయకుడు అని అన్నారు.అదే విధంగా మన ప్రియతమ నాయకుడు నారాచంద్రబాబునాయుడు ఈ రోజు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరబాద్‌లో ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్టు,సిటిలో ఉన్నా హైటెక్‌సిటి,గాంది అసుపత్రి,స్పోట్స్ హాకీ స్టేడియం,బెగంపెట గ్రౌండు తదితర వంటివాటిని అబివృద్ధి చేసిన ఘనత నారాచంద్రబాబు నాయుడుకు దక్కుతుందని పేర్కన్నారు.ఈ రోజు పేద ప్రజలకు న్యాయం జరగాలంటే తెలుగుదేశం పార్టినే అని వ్యాక్యనించారు.తెలంగాణాలో కాసాని జ్ఞానేశ్వర్ తెలుగుదేశం పార్టి ఆధ్యక్షుడు అయిన తరువాత ఖమ్మం బహిరంగ సమావేశం,టిడిపి పార్టి అవిర్బావ సభ ఎగ్జిబిషన్ గ్రౌండులో చాల ఘనంగా జరిగాయని చెప్పారు.ఈ రాష్ట్రన్ని కాపాడే సత్తా నారాచంద్రబాబునాయుడికే ఉందని తెలిపారు.ఎందుకంటే ఆయన విజన్ ఉనా న్నాయకుడు కాబట్టి తెలుగు దేశం ప్రభుత్వం ఏప్పుడు వస్తుందా అని ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు.తనతో పాటు కొటేశ్వరరావు, విశ్వనాధం,సంపత్,దత్తసాయి,పద్మరావులు కలసి తిరుమల వేంకటేశ్వరస్వామిని,శ్రీశైలభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్లను దర్శించుకోవడం జరిగిందని తెలిపారు.

# గుండెపోటుతో వి.ఆర్.ఓ.మృతి

**నందికొట్కూరు,ఏప్రిల్ 6,ప్రభాతవార్త:** మండల పరిధిలోని శానతకోట గ్రామంలో వి.ఆర్.ఓ. నల్లబోతుల వెంకటయ్య (51) అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. గురువారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో అతనిని చికిత్స నిమిత్తం తరలించగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు తెలిపారు. మృతుడు కొత్తపల్లి మండలం నందికుంట గ్రామ రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్నారు. మృతునికి ఇద్దరు సంతానం. ఈ విషయం తెలియడం కొత్తపల్లి తహాసిల్దార్ చంద్రశేఖర్‌నాయక్, రెవెన్యూ సిబ్బంది మృత దేహాన్ని సంధర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళీలు అర్పించారు.

# డయాలసిస్ పేషెంట్‌కు పెన్షన్ అందజేత

**- కొంతసేపటికే వ్యక్తి మృతి.**

**మంత్రాలయం,ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎం.తాండ గ్రామానికి చెందిన గోవింద నాయక్(53) అనే వ్యక్తి గత కొన్ని సంవత్సరాలుగా డయాలసిస్ వ్యాధితో బాధపడుతుండేవాడు.ఈ వ్యాక్తికి ప్రభుత్వం రూ.10,000 పెన్షన్ మంజూరు చేసింది.ఈ పెన్షన్ నగదును వాలంటీర్ రవినాయక్,వెల్ఫేర్ అసిస్టెంట్ లక్ష్మిలు కర్నూలులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా పెన్షన్ నగదు అందజేశారు.అయితే పెన్షన్ నగదు తీసుకున్న కొద్దిసేపటికే ఈ వ్యక్తి మృతి చెందాడు.

# తెలుగుదేశం పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం..!

**- ఆలూరు టిడిపి ఇంచార్జ్ కోట్ల సుజాతమ్మ**



**ఆలూరు రూరల్,ఏప్రిల్ 6,ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఆలూరు టిడిపి ఇంచార్జ్ కోట్ల సుజాతమ్మ అన్నారు. గురువారం ఆలూరు నియోజకవర్గం హొళగుంద మండల పరిధిలోని వందవాగిలి గ్రామంలో ఆ గ్రామ స్కూల్ కమిటీ ఛైర్మన్ కురువ ద్యావన్న గారి శేషన్నతో పాటు ఆయన అన్నదమ్ములు,బంధువులు దాదాపు 10కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగింది. వీరికి కోట్ల సుజాతమ్మ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అలాగే గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు వైసిపి పాలనతో విసుగుచెందారన్నారు. ఇందుకు నిదర్శనం మొన్న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత తెదేపాకు పట్టం కట్టడమేనన్నారు. రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని రానున్న 2024ఎన్నికల్లో వైసిపికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. రాష్ట్ర అభివృద్ధి తెదేపాతోనే సాధ్యమన్నారు. తెలుగుదేశం పార్టీలో కష్టపడి పని చేసిన ప్రతిఒక్కరిని పార్టీ గుర్తిస్తుందన్నారు. కావున ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతం కోసం కష్టపడి పని చేయాలన్నారు. అంతకుముందు కోట్ల సుజాతమ్మకు వందవాగిలి గ్రామస్తులు పూలతో ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# సచివాలయ ఉద్యోగులు మద్యాహ్నాం నుండి విధులకు డుమ్మా

**- ఎంపిపి డి వెంకటేశ్వరమ్మ**



**కర్నూలు రూరల్,ఏప్రిల్ 6,ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఉల్చాల గ్రామం జనాభాపరంగా విస్తీర్ణపరంగా కర్నూలు మండలంలోని గ్రామాల్లో ఈ గ్రామం ఒకటి. ఉల్చాల గ్రామంలో రెండు గ్రామ సచివాలయాలు ఉన్నాయి. గ్రామ సచివాలయాల ద్వారా గ్రామాలకు ప్రభుత్వ పథకాలు,ప్రభుత్వ సేవలు అందించాలన్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి కలను కొందరు సచివాలయ ఉద్యోగులు అబాసుపాలు చేస్తున్నారు. సచివాలయ ఉద్యోగుల పనితీరు పరిశీలించడానికి గురువారం కర్నూలు మండల ఎంపిపి డి వెంకటేశ్వరమ్మ సచివాలయాలను తనిఖీ చేయగా ఉల్చాల గ్రామంలోని సచివాలయం-1లో అగ్రికల్చర్ అసిస్టెంట్,వెల్ఫేర్ అసిస్టెంట్ తప్ప మిగతా గ్రామ సచివాలయ ఉద్యోగులు విధులకు మద్యాహ్నాం నుండి డుమ్మా కొట్టి కర్నూలుకి వెళ్లినట్లు కర్నూలు మండల ఎంపిపి డి వెంకటేశ్వరమ్మ తెలిపారు. 2వ సచివాలయంలో అయితే కేవలం ఇంజనీరింగ్ అసిస్టెంట్ తప్ప సచివాలయ ఉద్యోగులు ఎవరు లేరు అందరు మద్యాహ్నామే విధులకు డుమ్మా కొట్టి కర్నూలుకి వెళ్లిపోయినట్లు ఎంపిపి డి వెంకటేశ్వరమ్మ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ దేశంలో ఏ ముఖ్యమంత్రి ఆలోచించని విధంగా గ్రామ సచివాలయాల ద్వారా గ్రామస్తులకు ప్రభుత్వ పథకాలు ప్రభుత్వ అధికారుల ద్వారా సేవలందించడానికి నెలకొల్పితే సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించకుండ విధులను సరిగా నిర్వహించకుండ గ్రామ సచివాలయాలకు చెడ్డ పేరు తీసుకొచ్చే విధంగా ప్రవర్తిస్తున్నారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు స్వగ్రామమైన ఉల్చాలలోనే గ్రామ సచివాలయ ఉద్యోగస్తులు మద్యాహ్నాం నుండి విధులకు డుమ్మా కొట్టి కర్నూలుకు వెళ్లిపోవడం వారు ఎంత నిర్లక్ష్యంగా విధుల పట్ల వ్యవహరిస్తున్నారనేది ఈ చర్యల ద్వారా తెలుస్తుందన్నారు. ఉద్యోగులు నెలనెలా జీతం తీసుకుంటూ వారి ఉద్యోగ ధర్మం పాటించకుండ విధులకు డుమ్మా కొట్టడం..ప్రజాధనం దుర్వినియోగం చేయడమేనని ఆమె తెలిపారు. సచివాలయ ఉద్యోగులు విధులకు మద్యాహ్నాం నుండి డుమ్మాకొట్టడం కర్నూలు మండల ఎంపిడిఓ దృష్టికి,జిల్లా పరిషత్ సిఈఓ దృష్టికి ఫోన్ ద్వారా సమాచారం అందించినట్లు తెలిపారు. సచివాలయ ఉద్యోగస్తులపైన తగిన చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను కోరినట్లు తెలిపారు.

# వైద్యం అందుబాటులో ఉండేందుకే ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం -ఎమ్మేల్యే

**వెలుగోడు,ఏప్రిల్ 6,ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరికి వైద్యం అందుబాటులో ఉండేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం చేపట్టిందని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. గురువారం వెలుగోడు పట్టణంలో ఫ్యామిల డాక్టర్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాలో ఈ కార్యక్రమం ముఖ్యమంత్రి వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించడం జరిగిందన్నారు. మీ ఊరిలోనే మీ వద్దకే వచ్చి ఉచిత వైద్యం అందిస్తారని ఇలాంటి కార్యక్రమం దేశంలో ఎక్కడలేదని, వ్యాధి నివారణ సేవలో దేశానికే రోల్ మాడల్‌గా మన రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ అంధించే సేవలు సాధారణ వైద్య సేవలు, ప్రసూతి ఆరోగ్య సంరక్షణ సేవలు, బాలింతల ఆరోగ్య సంరక్షణ, గృహా సంధర్శన సేవలు, మండలంలో రెండు పిహెచ్‌సిలు, ప్రతి పిహెచ్‌సిలో ఇద్దరు డాక్టర్లు, ఒక 104 వాహానంతో అను సంధానం,ఒక డాక్టర్ స్తానికంగా ఉంటే మరో డాక్టర్ ప్రతి రోజు తనకు కేటాయించిన గ్రామంలోని డాక్టర్ వై.ఎస్.ఆర్.విలేజ్ హెల్త్ క్లినిక్,పాఠశాల, అంగన్వాడి కేంద్రాలను సందర్శించి వైద్య సేవలు అంధిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, మండల ప్రజా ప్రతినిధులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దత్తాత్రేయస్వామివారికి విశేష పూజలు

**శ్రీశైలంప్రాజెక్టు,ఏప్రిల్06,ప్రభాతవార్త :** లోక కలా్యణంకోసం దేవస్థానం గురువారంనాడు ఆలయప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద నెలకోని ఉన్న శ్రీదత్తాత్రేయస్వామివారికి విశేషపూజలను నిర్వహించడం జరిగింది.కాగా దేవస్థానసేవగా(సర్కారిసేవగా)ఈ కైంకర్యం జరిపించబడింది.ఈ పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహగణపతిపూజను జరిపించబడింది.ఆ తరువాత దత్తాత్రేయసా ్వమివారికి పంచామృతాభిషేకం,విశేష పూజలు నిర్వహించబడ్డాయి.లోకోద్దరణకోసమై బ్రహ్మ,విష్ణు,మహేశ్వరులు ఒకే ్వరూపములో దత్తాత్రేయునీగా అవతరించారు.అందుకే త్రిమూర్తి స ్వరూపునిగా దత్తాత్రేయుడు ప్రసిద్దుడు.కాగా శ్రీశైలక్షేత్రానికి దత్తాత్రేయుల వారికి ఎంతో దగ్గర సంబందం ఉంది.ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం క్రింద దత్తాత్రేయలవారు తపస్సు చేశారని ప్రతీతి.అందుకే ఈ వృక్షానికి దత్తాత్రేయ వృక్షమని పేరు.కాగా దత్తాత్రేయస్వామివారు కలియుగంలో గోదావరితీరాన పిఠాపురంలో శ్రీపాదవల్లభునిగా జన్మించారు.వీరు ఒకసారి శ్రీశైలక్షేత్రంలోనే చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించినట్లుగా గురుచరిత్రలో చెప్పబడింది.

# జగనన్నే మా భవిష్యత్తు

**బండిఆత్మకూరు, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:** మండలంలోని ఈర్నపాడు గ్రామంలో శ్రీశైలం నియోజకవర్గ శాసన సభ్యులు శిల్పా చక్రపాణిరెడ్డి అదేశాల మేరకు జేసిఎస్ మండల కన్వీనర్ ముడిమెల పుల్లారెడ్డి అధ్వర్యంలో జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 7 నుంచి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఇంటింటికి వెళ్లి గృహసారధులు, సచివాలయ కన్వీనర్లు ప్రతి గడపకు వెళ్లి జగనన్న పథకాలు, అభివృద్ధి గురించి వివరించాలని టిడిపి చేసిన మోసాల గురించి చెప్పాలని వారు తెలియజేశారు. ఈకార్యక్రమంలో సచివాలయ కన్వీనర్‌లు ఏ కూమార్‌రెడ్డి, సి శ్రీనివాసరెడ్డి, నాయకులు పెద్ద రామసుబ్బారెడ్డి, డి రమణయ్య, తులసిరెడ్డి, డి.మౌలాలి, వాలంటీర్లు, గృహసారధులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన హనుమాన్ జయంతి వేడుకలు

**హొళగుంద,ఏప్రిల్ 6,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన హొళగుందలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం స్వామి వారికి ఆకుపూజ,పంచామృతాభిషేకం,ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామపురవీధుల ఆంజనేయస్వామి వారిని భారీ ఊరేగింపు నిర్వహించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండ డిఎస్‌పి వినోద్‌కుమార్ ఆద్వర్యంలో ముగ్గురు సిఐలు,నలుగురు ఎస్‌ఐలు,సిబ్బంది పకడ్బందీగా బందోబస్తు నిర్వహించారు. గ్రామపెద్దలు ప్రత్యేకంగా పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# చలివేంద్రం ప్రారంభం

**పత్తికొండ,ఏప్రిల్ 6,ప్రభాతవార్త :** మండల పరిధిలోని దేవనబండ గ్రామంలో చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ పొట్లపాటి ప్రవీణ,కెనరాబ్యాంక్ మేనేజర్‌లు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పొట్లపాటి ప్రవీణ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులు,ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు,వాలంటరీలు పాల్గొన్నారు.

# రెండు వర్గాలుగా మాజీ ఎమ్మెల్యే బివి జన్మదిన వేడుకలు

**నందవరం, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన నందవరంలో తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు మాజీ ఎమ్మెల్యే బివి జయనాగేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలు రెండు వర్గాలుగా విడిపోయి వేరువేరుగా జరుపుకున్నారు. తెలుగుదేశం అవిర్భవించినప్పటి నుండి గ్రామంలో కంచుకోటగా వెలసిన చిన్న అనసూయమ్మ గౌడ్ కుటుంబలో జంబు నాగరాజు గౌడ్ తన అనుచరుల మధ్య మాజీ ఎమ్మెల్యే బివి జయనాగేశ్వర్‌రెడ్డి జన్మదినాన్ని పురష్కరించుకొని కేక్ కట్ చేశారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాయకులు దేశాయ్ మధురావు, మాజీ ఎల్ఎల్‌సి డైరెక్టర్ గడ్డం నారాయణరెడ్డి, క్లస్ట కన్వీనర్ కాశీం వలి, కార్యకర్తలు కలిసి బివి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు.ఈసందర్భంగా వారు స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఇప్పటికైనా ఇప్పటికైనా నందవరంలో వర్గపోరును గుర్తించి తెలుగుదేశం పార్టీ నాయకులను ఏకం చేయాలని కార్యకర్తలు కోరుచున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చిన్నరాముడు, సోమలగూడూరు వెంకటరామిరెడ్డి,నాగలదిన్నె జబ్బర్, చిన్నకొత్తిలి బ్రహ్మానందరెడ్డి,జోహరాపురం గజేందర్‌రెడ్డి,కైరవాడి వీరేష్, పెద్దకొత్తిలి అదిశేషు,మిట్టసాపురం వీరేష్,హలహర్వి నాగరాజు, నందవరం బసప్ప గౌడ్,మస్తాన్ రైమాన్ సాబ్, జగదీష్ నాగరాజ్,కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

# పద్మావతీనగర్ నుండి ఇండోర్ స్టేడియం వరకు రూ.2.40 కోట్లతో సిసి రోడ్ల నిర్మాణం



**నంద్యాల క్రైం, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:** నంద్యాల పట్టణం అభివృద్ధి పథంలో ముందుకు దుసుకెళ్తుతుంది. గ్రామాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభం చేపట్టారు. భూమి పూజ చేసి పనులను తక్షణమే మొదలుపెడుతున్న నేపధ్యంలో గురువారం నంద్యాల పట్టణం మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న పద్మావతీనగర్ మెయిన్ రోడ్డు నుంచి ఇండోర్ స్టేడియం వరకు రూ.2.40 కోట్ల వ్యయంతో సిసి రోడ్లకు నంద్యాల శాసన సభ్యులు శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, వైస్ చైర్మన్లతో గంగిశెట్టి శ్రీధర్, పాంషావలితో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతన్నామని తెలిపారు. ప్రధానంగా పద్మావతీనగర్‌లో వర్షాకాలంలో రోడ్డు నీటిముంపుకు గురవుతుందన్నారు. గత అనేక సంవత్సరాల నుండి పడుతున్న కష్టాలకు చెక్‌పెట్టారు. నూతనంగా సిసి రోడ్లు నిర్మాణం చేపట్టేందుకు చేసిన కృషి ఫలించిందన్నారు. ఈవేసవిలోపల దాదాపు 3 నెలల్లో పూర్తిచేయాలని కాంట్రాక్టర్లను కోరారు. ప్రధాన రహదారి కావడంతో ప్రజలు, వాహనదారులు కొంత ఇబ్బందికి గురికావాల్సి వస్తోందన్నారు. ట్రాఫిక్ అధికారులతో సంప్రదించి ట్రాఫిక్ నియంత్రణ చేయపడతామన్నారు. ఈకార్యక్రమంలో 35వ వార్డు కౌన్సిలర్ బషీద్, ఫైలెట్, రాష్ట్ర బెస్త సంఘం డైరెక్టరు చంద్రశేఖర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# తూతూ మంత్రంగా జగనన్న స్వచ్ఛ సంకల్ప శిక్షణ కేంద్రం

**పత్తికొండ,ఏప్రిల్6,ప్రభాతవార్త:** పత్తికొండ గ్రామ పంచాయతీ పరిధిలో గల జగనన్న స్వచ్ఛ సంకల్ప శిక్షణ కేంద్రం తూతూ మంత్రంగా శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారని పత్తికొండ-కర్నూలు రోడ్డులో ఉన్న స్మశానవాటిక స్థలం ఆవరణంలో తడి చెత్త- పొడిచెత్త పైన శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి షెడ్‌లు ఏర్పాటుచేసి పొడిచెత్త-తడి చెత్త పైన అవగాహన కల్పించడంలో అధికారులు రికార్డులలో మా త్రం శిక్షణ కేంద్రాలను నడిపినట్లు కోఆర్డినేటర్ రికార్డులలో మాత్రం అమలు చేస్తున్నట్లు చూపుతున్నారు.శిక్షణ కేంద్రాల్లో అమలుకావడంలేదని ఆ శిక్షణ కేంద్రాలకు కార్మికులు కూడా హాజరుకావడంలేదని,శిక్షణ కేంద్రంలో ఖాళీ కుర్చీలు తప్ప శిక్షణ కేంద్రంలో ట్రైనింగ్ తీసుకునేవారు కరువయ్యారు.జగనన్న స్వచ్ఛ సంకల్ప స్థానిక శిక్షణ కేంద్రాలలో అవగాహన నిర్వహిస్తున్నట్లు కేంద్రం శిబిరంలో మాత్రం బ్యానర్లు,చైర్లు,నిర్వహణ ఖర్చులు రాసుకుంటున్నారు తప్ప శిక్షణ కేంద్రాల్లో కార్మికులు కరువయ్యారు.ఇలాంటి జగనన్న స్వచ్ఛ సంకల్ప సంబంధింత అధికారుల శిక్షణ కేంద్రాలను తనిఖీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.దీనికి సంబంధించిన అధికారులు తక్షణమే కోఆర్డినేటర్ల పై చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పొడిచెత్త-తడిచెత్త పైన అవగాహన కోసం ఏర్పాటుచేస్తే దీనికి సంబంధించిన అధికారులు వృథా చేస్తున్నరన్నారు.ట్రైనింగ్ పొందినట్లు,ప్రజలకు అవగాహన కల్పించినట్లు ఈ ప్రాజెక్టును పక్కదారి పట్టిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

# దేశవ్యాప్తంగా బలోపేతమవుతున్న బిజెపి

**పత్తికొండ,ఏప్రిల్ 6,ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా బలోపేతమవుతుందని బిజెపి నియోజకవర్గ ఇంచార్జ ఈడిగ రంగాగౌడ్ అన్నారు. బిజెపి పార్టీ ఆవిర్భవించి 44వసంతాల్లోకి అడుగిడుతున్న సందర్భంగా జాతీయ రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు గురువారం నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రధాన కూడళ్లలో బిజెపి జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ జనసంగ్ ఆవిర్బావం తర్వాత ఆనాటి నాయకుల సూచనలు,ఆశయాల మేరకు 1980ఏప్రిల్ 6వ తేదీన జనసంఘ్ భారతీయ జనతా పార్టీగా ఆవిర్భవించిందన్నారు. రెండు పార్లమెంట్ సీట్లతో మొదలైన బిజెపి ప్రస్థానం నేడు 303సీట్లతో స్వతహాగా అధికార పగ్గాలను చేపట్టి దేశ అభివృద్ధికి భరతమాత ముద్దుబిడ్డ నరేంద్రమోడీతో పాటు అనేక మంది జాతీయ నాయకులు కృషి చేస్తున్నారన్నారు. ఆనాటి మహానుభావుల ఆశయాలు వమ్ము చేయకుండ నేడు గ్రామగ్రామాన పార్టీ బలోపేతంతో పాటు ఆంధ్ర రాష్ట్రంలో కూడా అధికార పగ్గాలు చేపట్టేందుకు ప్రతిఒక్క కార్యకర్త కృషి చేస్తున్నట్లు వివరించారు. నేటి నుండి 14వ తేదీ వరకు ఏడురోజుల పాటు అనేక సామాజిక న్యాయవారోత్సవ కార్యక్రమాలతో పాటు బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే,డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండి మల్లికార్జున,సీనియర్ నాయకులు పూన మల్లికార్జున,బిజెపి మండల అధ్యక్షులు శంకరయ్య ఆచారి,బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు,కిసాన్ మోర్చ జిల్లా కార్యదర్శి బారికి గోరంట్ల,లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు అడ్వకేట్ నగేష్,ఓబిసి మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు హోసూర్ బ్రహ్మయ్య,కరణం చంద్రన్న,కిసాన్ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు సిసి రంగన్న,సీనియర్ నాయకులు మిలిటరీ హుస్సేన్,పులికొండ ప్రతాప్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నతుంబళంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం

**పెద్దకడుబూరు,ఏప్రిల్ 6,ప్రభాతవార్త :** మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామ రైతుభరోసా కేంద్రంలో వ్యవసాయాధికారి వరప్రసాద్ వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కొత్తగా పాస్ పుస్తకాలు పొంది రైతుభరోసా పడని రైతులు రైతుభరోసా కోసం పొలం పాస్‌బుక్,బ్యాంక్ అకౌంట్,ఆధార్ కార్డు జిరాక్స్‌లు సంబంధిత రైతుభరోసా కేంద్రంలో ఇవ్వాలన్నారు. అలాగే ఎవరైనా చనిపోయిన రైతులు ఉంటే వారి నామిని బ్యాంక్ అకౌంట్,ఆధార్ కార్డు,డెత్‌సర్టిఫికేట్‌లు జిరాక్స్‌లు ఇవ్వాలన్నారు. ఇదివరకే రైతుభరోసా పడుతున్న రైతులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. వాలంటరీలు మీ పరిధిలో ఉన్న రైతులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నతుంబళం మాజీ ఎంపిటిసి ఎల్లప్ప, వ్యవసాయ సలహా మండలి సభ్యులు వలి భాషా,వెంకటేష్, రైతుభరోసా కేంద్ర సిబ్బంది రమాదేవి,రవితేజలు తదితరులు పాల్గొన్నారు.

# కన్నులపండుగగా సిద్ధరామేశ్వరుడి రథోత్సవం

**- భారీగా తరలివచ్చిన భక్తజనం**

**ఆస్పరి,ఏప్రిల్ 6,ప్రభాతవార్త :** మండల పరిధిలోని చిన్నహోతూరు గ్రామంలో వెలుగొందుతున్న శ్రీ శివయోగి సిద్ధరామేశ్వరస్వామి రథోత్సవం గురువారం కన్నుల పండుగగా అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త ఇటీన మంజునాథ్ తెలిపారు. అర్చకులు సిద్ధలింగేశ్వర స్వామి సిద్ధరామేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారిని ఉదయం ప్రత్యేక పూలతో అలంకరించి ఆకుపూజ,గంగపూజ,కుంకుమార్చన,పంచామృతాభిషేకం, మహామంగళారతి తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీ సుంకులమ్మ అవ్వ ఆలయంలో స్వామి వారి పాదాలకు ప్రత్యేకపూజలు నిర్వహించి అక్కడ నుండి మేళతాళాలతో గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలో పూజలు నిర్వహించి స్వామి వారికి సమర్పించారు. అనంతరం శ్రీ శివయోగి సిద్ధరామేశ్వర స్వామి,పార్వతి పరమేశ్వరులను పల్లకిలో కూర్చోబెట్టి గ్రామ పురవీధుల్లో పల్లకి సేవ నిర్వహించారు. సాయంత్రం పార్వతి పరమేశ్వరులను,శివయోగి సిద్ధరామేశ్వర స్వాములను రథోత్సవంలో కూర్చోబెట్టి రథాన్ని జనసందోహం మద్య లాగారు. భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల గ్రామాల నుండి అధిక సంఖ్య పాల్గొని మొక్కులు తీర్చుకుని దర్శించుకున్నారు. స్వామి వారికి కానుకలు సమర్పించారు. ఈ రథోత్సవ వేడుకల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండ ఆస్పరి ఎస్ఐ వరప్రసాద్ ఆద్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హరికృష్ణ, ఎంపిటిసి మౌనిక,వైసిపి నాయకులు బసవరాజు,టిడిపి మాజీ సర్పంచ్ వరదరాజులు, నెట్టెప్ప,మధు,తిమ్మప్ప,ఫీల్డ్ అసిస్టెంట్ మంజునాథ్,మాజీ సొసైటీ డైరెక్టర్ లక్ష్మన్నగ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనే వైసీపీ ప్రభుత్వ ధ్యేయం

**- మహిళల పక్షపాతిగా పేరు తెచ్చుకున్న సీఎం జగనన్న - ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి**




బనగానపల్లె,ఏప్రిల్6,ప్రభాతవార్త: మహిళల ఆర్థిక స్వావలంబనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని,ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అగ్రభాగం మహిళలకే దక్కుతున్నాయని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతిగా పేరు తెచ్చుకున్నారని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు.గురువారం బనగానపల్లె పట్టణంలోని జీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో వైఎస్సార్ ఆసరా పథకం మూడోవిడత కార్యక్రమాన్ని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి,జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి,ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ,వైసీపీ యువనాయకులు కాటసాని ఓబుళరెడ్డి,వైసీపీ సీనియర్ నాయకులు కాటసాని ప్రసాదరెడ్డి,అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాలొండ్డిలు గురువారం జ్యోతి ప్రజ్వలన గావించి వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రారంభించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి,పొదుపు సంఘాల మహిళలు పాలాభిషేకం చేశారు. తదనంతరం పొదుపు మహిళా సంఘాల సభ్యులకు ఎమ్మెల్యే మెగా చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ నాడు ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజల కష్టాలను తెలుసుకోవాలని స్వయంగా ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు 3648కిలో మీటర్లు ఎండనాకా వాననకా మండుటెండల్లో సైతం పాదయాత్ర నిర్వహించి ఆ పాదయాత్రలో ప్రజల కష్టాసుఖాలను స్వయంగా తెలుసుకున్నటువంటి నాయకుడు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని సగర్వంగా చెప్పుకోవచ్చని తెలిపారు. అలాంటి నాయకుడు అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల్లో ఇచ్చినటువంటి హామీలను ఒక భగవద్గీత,ఒక ఖురాన్‌గా,ఒక బైబిల్‌గా భావించి ఆ హామీలన్నింటిని ఇప్పటికే 98శాతం మేర నెరవేర్చడం జరిగిందని తెలిపారు.నవరత్నాలు అనే పథకం ద్వారా రాజకీయాలకు అతీతంగా, పార్టీలకు,కులాలకు,మతాలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్క పేదవాడికి గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లతో నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని చెప్పారు.గత తెలుగుదేశం పార్టీ హయాంలో జన్మభూమి కమిటీ పేరుతో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలంటే వారి నుంచి లంచాలు తీసుకుని అవినీతికి పాల్పడినటువంటి చరిత్ర తెలుగుదేశం పార్టీదని చెప్పారు.బనగానపల్లె పేద ప్రజలకు 3వేల ఇంటి పట్టాలు ఇస్తుంటే చూసి ఓర్వలేని టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి కోర్టుకు వెళ్లి పేదలకు ఇంటి స్థలాలు రాకుండా చేసినటువంటి ఘనత బీసీకి దక్కుతుందని ఆయన తెలిపారు. అలాగే ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకం మహిళలకు సంబంధించిన కార్యక్రమని కాబట్టి ఒక మహిళగా ఈ కార్యక్రమానికి హాజరై సీఎం జగనన్న అందిస్తున్నటువంటి పథకాలను నియోజకవర్గంలోని మహిళలకు, ప్రజలందరికి తెలియజేయాల్సిన బాధ్యత తమ పై ఉందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలియజేయడంతో తాను ఈ కార్యక్రమానికి హాజరయ్యానని తెలిపారు. జగనన్న అధికారం చేపట్టిన తరువాత మహిళలకు ఆర్థికస్వావలంబన,అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళలకు కేటాయించడం జరుగుతుందని చెప్పారు..ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం శేషిరెడ్డి,జిల్లా వైసీపీ యువజన సంఘం అధ్యక్షులు గుండం నాగేశ్వరరెడ్డి,రాష్ట్ర కుర్ణి సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ మెటికెల శ్యామలాదేవి,వైసీపీ మైనార్టీ నాయకులు అత్తార్ జాహీద్ హుస్సేన్,అబ్దుల్ ఫైజ్,డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, మండల అధ్యక్షురాలు మానసవీణ,జెడ్పీటీసీ సుబ్బలక్ష్మమ్మ,బనగానపల్లె సర్పంచ్ ఈసారి ఎల్లమ్మ,ఎంపిడివో శివరామయ్య,వెలుగు సీసీ తిరుపాల్‌రెడ్డి,మండల అధికారులు, పొదుపు మహిళా సంఘాల సభ్యురాల్లు, పొదుపు మహిళలు,వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## మంత్రి బుగ్గన పిఏ పేరుతో కొందరు దుండగులు దౌర్జన్యం

**- దాడిచేసి రూ.70 వేల నగదును దోచుకెళ్లారు**

**- దుండగుల నుంచి ప్రాణహాని - సంఘటనలో పోలీసులు ప్రేక్షకపాత్ర**

**నంద్యాల క్రైం, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:** రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పిఏ పేరుతో కొందరు దుండగులు దౌర్జన్యానికి పాల్పడ్డారు. వివాదంలో ఉన్న ఇంట్లోకి జొరబడి అక్రమంగా దాడికి పాల్పడ్డారు. ఇంట్లో సామాన్లను ధ్వంసం చేసి రూ.70 వేలు చోరిచేసిన సంఘటన చోటుచేసుకుంది.బాధితురాలు వివరాల మేరకు ఆళ్లగడ్డకు చెందిన పుల్లారెడ్డి అతని వర్గీయులు హాల్‌చల్‌చేశారని సాయిబాబానగర్‌లో ఉంటున్న గోపాల్ లక్ష్మీదేవి దంపతులు ఉంటున్న ఇళ్లను తాళాలు పగలగొట్టి అక్రమంగా ఇంట్లోకి చొరబడి నానా అలజడి సృష్టించి రూ.70 వేలు దోచుకెళ్లారని తెలిపింది. మంత్రి పిఏ పుల్లారెడ్డి కొడుకు బొరెడ్డి పుల్లారెడ్డి కూతురును పెళ్లి చేసుకున్నారని 2014లో అక్రమంగా ఇంటిని తప్పుడు రిజిష్టర్‌తో చేశారని తెలిపింది. వీటిపై కోర్టులో వివాదం జరుగుతుంది. వరుసగా దాడులకు పాలుపడుతున్నారని లక్ష్మీదేవి అవేదన వ్యక్తం చేసింది. ఈసంఘటనపై జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, టూటౌన్ సిఐ ప్రభాకర్‌రెడ్డికి ఫోన్ ద్వారా సమాచారాన్ని తెలిపానని పోలీసులు తక్షణమే సంఘటన స్థలానికి చేరుకున్నట్లు తెలిపింది. కాగ దుండగులు అక్కడే ఉన్నా పోలీసులు పట్టి పట్టనట్లు వ్యవహారించారని వాపోయారు. టూటౌన్ సిఐ ప్రభాకర్‌రెడ్డి దుండగుల వద్ద అవినీతికి పాల్పడడం వల్ల ఎలాంటి చర్యలు తీసుకోలేదని అరోపించింది. సిఐకి సమాచారం అందిస్తే నేనేమి చేయాలమ్మా అని సమాధానం ఇచ్చారని లక్ష్మీదేవి వాపోయారు. ఏది ఏమైనా ఈసంఘటనలో పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించినట్లు తెలుస్తోంది. ఈమేరకు లక్ష్మీదేవి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సిఐ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ లక్ష్మీదేవి, గోపాలకృష్ణ దంపతులు పోలీస్‌స్టేషన్‌కు ఏవరు రాలేదని వస్తే విచారణ చేసి కేసు నమోదుచేస్తామని అని సమాధానం ఇచ్చారు.

## జిల్లాలో 244 మంది విద్యార్థులు గైర్హాజర్

**నంద్యాల విద్య,ఏప్రిల్ 6,ప్రభాతవార్త:**
10వ తరగతి పరీక్షల్లో జిల్లాలో మొత్తం 244 మంది గురువారం గైర్హాజర్ అయినట్లుగా డి.ఇ.ఓ. తెలిపారు. నంద్యాల జిల్లాలో 125 పరీక్షా కేంద్రాలలో 22,638 మంది విద్యార్థులకు గాను 22,394 మంది హాజరయ్యారని డి.ఇ.ఓ. తెలిపారు. డి.ఇ.ఓ. 5 కేంద్రాలను సంధర్శించడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా 5 ఫ్లైయింగ్ స్కాడ్ టీములు 32 కేంద్రాలను సంధర్శించడం జరిగిందని అదే విధంగా స్టేట్ అబ్జర్వర్ ఆర్.నరసింహ్మారావు 8 పరీక్షా కేంద్రాలను తనిఖీలు చేశారని డి.ఇ.ఓ. తెలిపారు.

## సి.ఎం.రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణి



**వెలుగోడు,ఏప్రిల్ 6,ప్రభాతవార్త:** స్ధానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సి.యం.రిలీఫ్ పండ్ కింద మంజూరు అయిన రూ. 3.65 లక్షల చెక్కులను శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి లబ్దిదారులకు పంపిణి చేశారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతు పేదలకు సి.యం. రిలఫ్ ఫండ్ ఓ వరం లాంటిదని, చికిత్సలు పొంది ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యం అన్నారు. అనంతరం,బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో భాధపడుతున్న వైకాపా నాయకులు మాలిక్‌ఖాన్ గృహానికి ఎమ్మెల్యే వెళ్లి పరామర్శించి మెరుగౌన చికిత్స నిమిత్తం ఎల్ఓసి ద్వారా సహాయం రూ.1.50 లక్షలు సహాయం అందజేసి ధైర్యంగా ఉండాలని మనోధైర్యం కల్పించారు.

## శ్రీగిరిలో ఘనంగా అక్కమహాదేవి జయంతి



**శ్రీశైలంప్రాజెక్టు,ఏప్రిల్06,ప్రభాతవార్త :**
శ్రీశైలమల్లికార్జునస్వామివారి పరమ భక్తులలో ఒకరైన శివశరణి అక్కమహాదేవి జయంతోత్సవం గురువారంనాడు ఆలయ ప్రాంగణంలో ఉదయం సంప్రదాయబద్ధంగా నిర్వహించడం జరిగింది.జయంతి వేడుకల్లో శ్రీశైలందేవస్థానం ఈఓ లవన్న,అర్చకస్వాములు పాల్గొన్నారు. అక్కమహాదేవి వారికి పంచామృత అభిషేకం,జలాభిషేకం తదితర పూజలు నిర్వహించారు.కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహగణపతి పూజ నిర్వహించడం జరిగింది.కాగా 12వ శతాబ్దంలో కన్నడ ప్రాంతాన శివశరణులుగా ప్రసిద్ధి పొందిన మహభక్తులలో అక్కమహాదేవి ఒకరు.వీరనారిగా పేరొందిన అక్కమహాదేవి,శ్రీశైలమల్లికార్జునస్వామివారిని తమ బాగస్వామిగా భావించి తరించింది.అక్కమహాదేవి తన జీవితపు చివరి రోజులను శ్రీశైలంలోనే గడిపింది. అక్కమహాదేవి జయంతిని పురస్కరించుకోని సాయంకాలం భ్రామరీ కళావేదికపై అక్కమహాదేవి జీవిత విశేషాలపై డా.ఎం.మహంతయ్య వారి ప్రవచన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

## రంగనాథుని సన్నిధిలో పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు గౌరు

**జూపాడుబంగ్లా, ఏప్రిల్ 6 ,ప్రభాతవార్త**
రాయలసీమ జిల్లాల్లో ప్రసిద్ది చెందిన శ్రీ తర్తూరు లక్ష్మీ రంగనాథస్వామి తిరుణాల సంధర్భంగా నంద్యాల పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు, నందికొట్కూరు టిడిపి ఇన్‌చార్జ్ గౌరు వెంటకరెడ్డి గురువారం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ అధికారులు ఆయనకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి గౌరుకు తీర్థప్రసాదాలు అందజేవారు. ఈ సందర్బంగా ఆర్చకులు గౌరు వెంకటరెడ్డిని శాలుతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిడిపి నాయకులు గుండం రమణారెడ్డి, కడియం వెంకటేశ్వర్ల యాదవ్, కాకర్ల చిన్న వెంకటస్వామి,రమణారెడ్డి, రామ్మోన్‌రెడ్డి,ఖాతా రమేష్, గిరీశ్వరరెడ్డి, అశోక్‌రెడ్డి, శేఖర్ గౌడు, మద్దిలేటి, కడియం సంపత్ కుమార్ యాదవ్, నారాయణ రెడ్డి,పలచాని మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమ పథకాల సారథి జగనన్న..

**తుగ్గలి,ఏప్రిల్ 6,ప్రభాతవార్త :**
సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో మరెక్కడ లేని విధంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని జొన్నగిరి గ్రామంలోని దేశాయి తాండ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ గుంత దేవి,సచివాలయ కన్వీనర్ గుంత రఘు,వైస్ ఎంపిపి ఎర్రనాగప్ప మరింతమంది నాయకులు,కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. గుంత రఘు దంపతులు ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే దేశాయి తాండలోని ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలను అందచేస్తూ స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దేశాయి తాండలో తాగునీటి సమస్య వెంటాడుతోందని అక్కడి ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి తాగునీటి సమస్యకు పరిష్కార మార్గం చూపుతానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవమ్మ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా కుల,మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. నాడు-నేడు, రైతుభరోసా, సచివాలయ వ్యవస్థ, వాలంటరీల ద్వారా గడప గడపకు సంక్షేమ లబ్ది అందుతుందని ఇలా మన రాష్ట్రంలో మినహా దేశంలో ఎక్కడా లేదన్నారు. ఇన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న సిఎం జగన్‌కి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి పులికొండ నాయక్,మండల కన్వీనర్ జిట్టా నాగేష్,పగిడిరాయి జగన్నాథ్‌రెడ్డి, రాంపురం సర్పంచ్ కమల్ భాష,పగిడిరాయి సర్పంచ్ గౌరవ సలహాదారుడు హనుమంతు,రాంపురం గంగాధర్, మాజీ జడ్‌పిటిసి నారాయణ నాయక్, వెంకటేష్ నాయక్,ఆర్ఐ సుధాకర్ రెడ్డి,విఆర్ఓ కిరణ్, పంచాయతీ సెక్రటరీ నారాయణస్వామి,వెలుగు సిసి రవికుమార్,ఫీల్డ్ అసిస్టెంట్లు సుంకప్ప,బద్రి శేఖర్,లాల్‌రెడ్డి,నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సిబ్బంది,వాలంటరీలు తదితరులున్నారు.



## వాల్మీకి విగ్రహ ప్రతిష్టకు తనవంతు సహకారం అందిస్తా



**ఆదోని,ఏప్రిల్ 6,ప్రభాతవార్త :** కల్లుబావిలో వాల్మీకి విగ్రహ ప్రతిష్టకు తనవంతు సహకారం అందిస్తానని టిడిపి మాజీ ఇంచార్జ్ ఆది కృష్ణమ్మ గుడిసె అన్నారు. గురువారం కల్లుబావిలో వాల్మీకి మహర్షి నూతన మందిర దేవాలయ నిర్మాణం కొరకు టిడిపి మాజీ ఇంచార్జ్ గుడిసె కృష్ణమ్మ నిర్మాణ స్థలాన్ని సందర్శించి రూ.11,000 ఆర్థిక సహాయం అందచేశారు. గుడిసె కృష్ణమ్మకి వారి కుటుంబ సభ్యులందరికి ఆ భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలని కల్లుబావి వాల్మీకి బోయ కుటుంబ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎల్‌సి మాజీ చైర్మన్ బసాపురం రామస్వామి,టిడిపి రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు,వడ్డేమాన్ గోపాల్,బోయ రాజు,మాజీ కౌన్సిలర్ మల్లికార్జున,ఎండి హుస్సేన్,నారాయణపురం షేక్షావలి,సాదిక్ వలి,మండగిరి బాబురావు,కల్లుబావి వాల్మీకి బోయ యువకులు,పెద్దలు పాల్గొన్నారు.

## రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న గుడిసె కృష్ణమ్మ

**ఆదోని,ఏప్రిల్ 6,ప్రభాతవార్త :** పట్టణంలోని కల్లుబావిలో హంపయ్య పున్నమి పండుగ పురస్కరించుకుని కల్లుబావి వార్డు నందు శ్రీ మణి కోప ఆంజనేయస్వామి,కందనాతి మారెమ్మ అవ్వకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ రథోత్సవ పూజా కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మాజీ ఇంచార్జ్ గుడిసె కృష్ణమ్మ,ఎల్ఎల్‌సి మాజీ చైర్మన్ బసాపురం రామస్వామి,టిడిపి రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు,వడ్డేమాన్ గోపాల్,మాజీ కౌన్సిలర్ మల్లికార్జున,ఎండి హుస్సేన్, బాబురావు,స్థానిక తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## నంద్యాల అభివృద్ధిపై అడుగులు

**- రూ.20 లక్షలతో సిసిరోడ్లకు భూమి పూజ**




**నంద్యాల క్రైం, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:**
నంద్యాల పట్టణం రోజు రోజు అభివృద్ధిపై అడుగులు పడుతున్నాయి పాడైపోయినా, నూతన సిసి రోడ్లకు నిర్మాణానికి ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. గురువారం ఉప్పరిపేట, బాల్‌కొండహాల్ వీధిలో రూ.20 లక్షలతో సిసి రోడ్లను ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసాతో కలిసి సిసి రోడ్లను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటి పరిధిలో 8వ వార్డులో 20 లక్షల రూపాయలతో సిసి రోడ్డు ప్రారంభించడం చాల సంతోషంగా ఉందన్నారు. గతంలో టిడిపి నాయకులు అభివృద్ధి చేశామంటూ ఊదరగొట్టడమే తప్పా చేసింది ఏ కోసాన లేదన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సమస్యలను తక్షణ పరిష్కారం జరుగుతుందని తెలిపారు. గుంతలమయమైన రోడ్లతో ప్రజలు ఇబ్బంది పడడంతో చూసి తక్షణ నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈకార్య క్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీదర్, పాంషావలి, వైసీపీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## వైసిపికి భారీ షాక్ టిడిపిలోకి మత్స్యకార కుటుంబాలు



**వెలుగోడు,ఏప్రిల్ 6,ప్రభాతవార్త:** వెలుగోడు పట్టణంలో అధికార పార్టీ వైకాపాకు భారీ షాక్ తగిలింది. గురువారం ఇదేమి ఖర్మ మన రాష్టానికి మరియు ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో భాగంగా పాత తెలుగుపేట మరియు రజకపేటకు చెందిన 120 మత్స్యకార కుటుంబాలు తెలుగుబుడ్డన్న , టైలర్ నాగస్వామి, ఎల్లశేషులు ఆధ్వర్యంలో శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో టి.డి.పి.లో చేరారు. ఈ సందర్భంగా బుడ్డా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతు గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హాయయాంలో అనేక సంక్షేమ పథకాల ద్వారా మత్స్యకారులను ఆదుకున్నామని, బోట్లు, ఇంజన్లు, వలలు, టూ వీలర్లు, ఫోర్ వీలర్లు సబ్సిడిపై అంధించామన్నారు. ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటిలకు మత్స్యకారులకు సంభంధించి చెరువుల నిర్వహణకు ఆర్థిక సాయం, డీజిల్‌పై సబ్సిడి ఇచ్చామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మత్స్యకారులకు సంభంధించిన చెరువులను దోచుకోవడానికి 217 జీఓ తెచ్చి బడా వ్యాపారస్థులకు అంధించడానికి కుట్ర చేస్తున్నదన్నారు. మళ్ళీ మత్స్యకారుల కుటుంబాలలో వెలుగు నింపాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలన్నారు. రాబోయేది రాష్ట్రంలో టిడిపియేనని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు రమణ, బాలస్వామి, గొల్ల రమణ, చంద్రయ్య, రామరావు, మద్దిలేటి,శివన్న, వెంకటశివుడు, గొల్లశ్రీను, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 9న ఆర్యవైశ్య ముఖ్యుల సమావేశం



**కర్నూలు న్యూసిటి, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:** ఆర్యవైశ్య ముఖ్యుల సమావేశం ఈనెల 9వ తేదిన ఉదయం 10.30 గంటలకు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు జరుగుతుందని కర్నూలు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. గడిచిన నాలుగు సంవత్సరాల్లో రాష్ట్రంలో వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ప్రతి వ్యాపారస్థుడు ఇబ్బందులకు గురయ్యారని, వ్యాపారస్థులపైన,ఆర్యవైశ్యులపట్ల అవలంబిస్తున్న వ్యతిరేక విధానాల గురించి చర్చించుకోవడం, కరోనా కారణంగా ఎంతో మంది వ్యాపార సంస్థల వారు ఎన్నోవిధాలుగా నష్టపోడం జరిగిందన్నారు. ఎంతోమంది వైశ్యసోదరులు తమ పిల్లల భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్నా వారి ఆశలు అడియాశలయ్యాయన్నారు. మన అస్తులను, వ్యాపారాలను కాపాడుకోవాలంటే అర్యవైశ్యసోదరులంతా ఐక్యమత్యంగా, ధైర్యంగా ముందుకు రండి, మనమంతా తెలుగుదేశం పార్టీకి అండగా నిలుద్దాం, చంద్రబాబు నాయుడును అడుగుదాం, రానున్న రోజుల్లో మనకు కావాల్సినటువంటి సౌకర్యాల గురించి రాజకీయంగా కూడ ఆర్యవైశ్యులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని వారికి విన్నవిద్దాం. సమావేశానికి ప్రతిఒక్క ఆర్యవైశ్యసోదరుడు హాజరై సమావేశాన్ని విజయవంతం చెద్దామన్నారు.

## అక్కచెల్లెమ్మలు ఆర్థికంగా బలపడాలన్నదే సి.యం. ఆశయం -ఎమ్మెల్యే

**కొత్తపల్లి, ఏప్రిల్ 6,ప్రభాతవార్త:** రాష్ట్రంలో అక్క చెల్లమ్మలు ఆర్థిక పరంగా బలపడాలన్నదే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని నియోజకవర్గం ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో వై.ఎస్.ఆర్. ఆసరా మూడవ విడత వారోత్సవాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. పొదుపు మహిళలతో కలిసి సి.యం.చిత్రపటానికి ఎమ్మెల్యే పాలాభిషేకం చేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతు సి.యం.జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను అన్ని 90 శాతం పూర్తి చేశారని, మహిళలు ఒకరిపై ఆధారపడకుండా స్వశక్తితో ఆర్థికంగా ఎదిగేందకు మూడవ విడత ఆసరా కింద 532 స్వయం సహాయక సంఘాలకు రూ.3,32,18,191ల చెక్కును మహిళల ఖాతాలలో జమచేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను అందరు సద్వినియోగం చేసుకొని రాష్ట్ర ప్రభుత్వానికి అండగా నిలబడి జగనన్నను మరో సారి ఆశీర్వదించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎం.పి.డి.ఓ.మేరి, రాష్ట్ర శాలివాహన కార్పోరేషన్ డైరెక్టర్ సుగూరు రమణమ్మ, ఏ.పి.ఎం,పుల్లయ్య, మండల నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, దుద్యాల మహమ్మద్‌రఫీ, సుగూరు సాయిరాం, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎం.పి.టి.సి.లు తదితరులు పాల్గొన్నారు.



## అప్పు ఇవ్వలేదని కత్తితో దాడి

**బండి ఆత్మకూరు, ఏప్రిల్ 6, ప్రభాతవార్త;**
మండలంలోని సింగవరం గ్రామంలో గ్రామస్తులు ఈశ్వర్ నరేంద్ర నాగలింగం గ్రామ సమీపంలో మద్యం సేవిస్తుండగా తెనాలి రామాంజనేయులు వెంకటేశ్వర్లు ఇరువురు వారి దగ్గరికి వెళ్లి మా అప్పు ఇవ్వాలని అడిగారు అది మాట మాటకు పెరిగి వాగ్వాదం జరిగింది అక్కడున్న వారు వారికి సద్ది చెప్పి వారింటికి పంపించారు. సాయంత్రం సమయంలో తెనాలి రామాంజనేయులు వెంకటేశ్వర్లు అన్నదమ్ములు ఇద్దరు ఈశ్వర్ , నరేంద్ర నాగలింగం దగ్గరకు వెళ్లి నా అప్పు ఇవ్వాలని మళ్లీ గొడవకు దిగారు. ఇరువురి వాగ్వాదంతో వెంకటేశ్వర్లు అనే వ్యక్తి కత్తి తో ఈశ్వర్ అనే వ్యక్తిని పొడుచాడు. తీవ్ర రక్తస్రావంతో ఈశ్వర్, నరేంద్రకు ప్రభుత్వ ఆసుపత్రి నందు వారు చేరారు. బండి ఆత్మకూరు వస్తే బాబు వివరాల మేరకు ఈశ్వర్ అనే వ్యక్తి వెంకటేశ్వర్లకు 50,000 అప్పు ఇవ్వాలని ఆ విషయంలో ఇద్దరు వద్ద వాగ్వాదం జరిగిందని వెంకటేశ్వర్లు కత్తితో ఈశ్వరుని పొడిచారని ఇ ఈ గొడవలో నరేంద్రకు గాయాలయ్యాయని తెలియజేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని మరిన్ని విషయాలు వెల్లడిస్తామని తెలియజేశారు.

## మతసామరస్యాన్ని పెంపొందించేలా పండుగలు జరుపుకోవాలి

**నంద్యాల క్రైం, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:** ప్రజలు సోదరభావంతో మెలుగుతూ మత సామరస్యాన్ని పెంపొందించేలా పండుగలు జరుపుకోవాలని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లీంలు చేపట్టె ఉపవాస దీక్షల సందర్భంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముఖ్య అతిథిగా ఎస్పీ పాల్గొన్నారు. పట్టణంలోని రెడ్డిచావిడిలోని చౌక మసీద్ నందు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముస్లీంలతో ఎస్పీ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ముస్లీం మత పెద్దల ఆహ్వానం మేరకు తాను ఇఫ్తార్ విందులోపాల్గొనడం జరిగిందని ఇలా ఇఫ్తార్ విందులో పాల్గొనడం చాల సంతోషంగా ఉందన్నారు. పండుగలను శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా జరుపుకొని జిల్లాకు మంచిపేరు తేవాలని అందరికి అల్లాదీవెనలు ఉండాలని కోరుకుంటున్నట్లు ముస్లీంలందరికి రంజాన్ మాసం సందర్బంగా శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈకార్య క్రమంలో ముస్లీం మత పెద్దలతో పాటు పోలీసు అధికారులు పాల్గొన్నారు.



## మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం - శిల్పా




**నంద్యాల, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:**
మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయమని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డిలు పేర్కొన్నారు. గురువారం గోస్పాడు మండలంలో నిర్వహించిన వైయస్ఆర్ అసరా మూడవ విడత సంబరాల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్బంగా ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల్లో భాగంగా ఏ ఒక్క పథకాన్ని తాము చెప్పిన మాటప్రకారమే తమ అక్కచెల్లెల్లకు అందరికి మేలు జరిగే విధంగా ప్రతిపథకాన్ని అమలుచేస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదే అని పేద, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు చెందిన అర్హులైన అందరికి పథకాలు ప్రవేశపెట్టి అందిస్తున్నామని అక్కాచెల్లెలందరికి మేము మంచి చేస్తుంటే టిడిపి వారు మోసపూరిత మాటలు కళ్లబొల్లి మాటలు నమ్మిమోసపోరాదని మళ్లి పాత రోజులు పునరావృతం అవుతుందని, రాష్ట్ర అభివృద్ది తిరోగమనంలో ఉంటుందని ముఖ్యమంత్రి మహిళా సంక్షేమ పథకాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వారికి పెద్దపీట వేశారన్నారు. రానున్న ఏడాదిలో నాల్గవ విడత రుణమాఫీ తప్పక చేస్తామని ఆయన అన్నారు. ఇప్పటివరకు గోస్పాడు మండల పరిధిలోని రూ.16.93 కోట్ల రూపాయల రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వానికి అక్కాచెల్లెమ్మలు అండగా నిలవాలని తమను మరిచిపోవద్దని మళ్లి వైయస్ఆర్ పార్టీనే ఆశీర్వదించాలని కోరారు. అనంతరం మహిళలకు రూ.5.64 కోట్ల చెక్కును అందజేశారు. అలాగే గోస్పాడు మండలంలో చేపడుతున్న అభివృద్ది పనులు త్వరగా పూర్తిచేస్తామని వారు హామి ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ అర్థర్‌సైమన్ వైసీపీ మండల కన్వీనర్ పిపి రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్రసోషల్ మీడియా కో-ఆర్డినేటర్ పిపి మధుసూదన్‌రెడ్డి, వైసీపీ నాయకులు ప్రహ్లాదరెడ్డి, శ్రీనివాసరెడ్డి, భాస్కర్‌రెడ్డి, బెక్కెం నాగేశ్వర్‌రెడ్డి, వైయస్ఆర్‌సిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు శకుంతలమ్మ, రాష్ట్ర బెస్త సంఘం డైరెక్టరు చంద్రశేఖర్, ఎంపిడిఓ సుగుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.